కురబలకోట మండలం ముదివేడు సమీపంలో కోడిపందేలు జరుగుతున్న దృశ్యం



జోరుగా కోడిపందేలు

- లక్షల్లో బెట్టింగులు
- భారీగా తరలివచ్చిన జూదరులు

కురబలకోట, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముదివేడు పోలీస్‌స్టేషన్‌కు సమీపంలో ఆదివారం జోరుగా కోడిపందేలను నిర్వహించారు. సంక్రాంతి పండుగ వెళ్లినా ఆ పండుగ ఆనవాయితీ పేరుతో అధికార పార్టీకి చెందిన కొంతమంది నేతలు కోడిపందేలను జరిపించారనే ఆరోపణలు ఉన్నాయి. చుట్టుపక్కల ప్రాంతాలతో పాటు సుదూర ప్రాంతాలకు చెందిన వారికి కోడిపందేలను నిర్వహిస్తున్నట్లు సమాచారం అందించారు. దీంతో ఈ కోడిపందేలకు చుట్టుపక్కల గ్రామాల నుంచే కాకుండా సుదూర ప్రాంతాలకు చెందిన జూదరులు పెద్దసంఖ్యలో తరలి రావడంతో ఆ ప్రాంతమంతా కోడిపందెంరాయుళ్లతో కిటకిటలాడింది. ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు పందేలను యథేచ్ఛగా నిర్వహించారు. పందేలు లక్షలలో జరిగాయి. పందెంరాయుళ్లకు అక్కడే తినుబండారాలను, కావాల్సిన వస్తువులను ఏర్పాటు చేశారు. బెట్టింగ్ రూపంలో నిర్వాహకులు భారీ స్థాయిలో డబ్బులు వసూలు చేశారని పలువురు బహిరంగంగా చెబుతున్నారు. ఏ మారుమూల ప్రాంతంలో ఏమీ జరిగిన వెంటనే సంబంధిత శాఖాధికారులకు తెలుస్తుంది. అయితే ఉదయం నుంచి సాయంత్రం వరకు జరిగినా అధికారులకు తెలియకపోవడం గమనార్హం. సంక్రాంతి పండుగ రోజున కూడా మట్లివారిపల్లె సమీపంలోని కమ్మగోవిందపల్లె సమీపంలో, తెట్టు పంచాయతీ దొమ్మనబావి సమీపంలో భారీగా కోడిపందేలు జరిగినట్లు పలువురు చెబుతున్నారు. ఈ విషయమై ఎస్‌ఐ దిలీప్‌కుమార్‌ను వివరణ కోరగా కోడిపందేలు జరుగుతున్న విషయం తమ దృష్టికి రాలేదని, మీ ద్వారా తెలిసిందని వెంటనే సిబ్బందితో వెళ్లి పరిశీలించామని, అయితే అక్కడ ఎలాంటి కోడిపందేలు జరగలేదని ఎస్‌ఐ తెలిపారు.

2021లో కొట్టుకుపోయిన పాపిరెడ్డిగారిపల్లె-మహల్ గ్రామాల మధ్యలో ఉన్న బాహుదా బ్రిడ్జి (ఫైల్)... ప్రస్తుతం కుంగిపోతున్న బ్రిడ్జి





కూలితే గానీ పట్టించుకోరేమో..!

- శిథిలావస్థలో పలు వంతెనలు
- వెక్కిరిస్తున్న గత పాలకుల వైఫల్యం
- కూటమి ప్రభుత్వమైనా పట్టించుకోవాలంటున్న ప్రజలు

పీలేరు/కలకడ/వాల్మీకిపురం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ పాలనలో వైఫల్యాలకు పీలేరు నియోజకవర్గంలోని అనేక వంతెనలు చిహ్నాలుగా నిలుస్తున్నాయి. శిథిలావస్థకు చేరుకుని కూలిపోయేందుకు సిద్ధంగా ఉన్నాయి. అవన్నీ చూడడానికి చిన్నవే వాటి అవసరం మాత్రం పెద్దదే. పదుల సంఖ్యలోని గ్రామాల రాకపోకలకు అవే మార్గం. పిల్లర్లు తుప్పపట్టి బయటకు కనిపిస్తున్న ఇనుప చువ్వలు, ఒక్కొక్కటిగా కట్రాళ్లు ఒరిగిపోతున్నా, పాక్షికంగా కుంగిపోయినా ఎవరూ పట్టించుకోవడం లేదు. అవన్నీ మూడేళ్ల క్రితం వచ్చిన భారీ వర్షాల సమయంలోనే తమ దృష్టికి వచ్చినా అప్పటి పాలకులు ఎందుకనో వాటిని చూసీ చూడనట్లు వదిలేశారు. అదిగో నిధులు తెప్పిస్తున్నాం, ఇదిగో రిపేర్లు చేయించేస్తాం అంటూ కాలయాపన చేశారు తప్ప వాటి మరమ్మతులు గురించి గానీ, వాటి స్థానంలో కొత్త వాటి నిర్మాణం గురించి గానీ పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వమైనా వాటి గురించి పట్టించుకుని తమకు సురక్షిత ప్రయాణం కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

శిథిలావస్థలో గూడరేవుపల్లె వంతెనలు

పీలేరు మండలం గూడరేవుపల్లె వద్ద బడబళ్లవంకపై ఉన్న బ్రిడ్జి శిథిలావస్థకు చేరుకుని నేడో రేపో కూలిపోయేందుకు సిద్ధంగా ఉంది. పీలేరు మండలంలోని అంతర్గత ప్రధాన రహదారుల్లో పీలేరు-తలపుల మార్గం ఒకటి. ఆ మార్గంలో గూడరేవుపల్లె, జాండ్ల, తలపుల, మేళ్లచెరువు గ్రామ పంచాయతీలు ఉండగా ఈ దారి గుండా పొరుగునే ఉన్న కేవీ పల్లె మండలం జిల్లేళ్లమంద, కడప జిల్లా పింఛా, ఎర్రావారిపాళెం మండలంలోని యల్లమంద, బోడేవాండ్లపల్లె ప్రాంతాలకు చేరుకోవచ్చు. పీలేరు డిపోకు ఆదాయం తెస్తున్న అతి కొద్ది మార్గాల్లో ఇదీ ఒకటి. ఈ వంతెనపై ప్రతి రోజూ వేలాది సాధారణ వాహనాలతో పాటు మట్టి, ఇసుక టిప్పర్లు తిరుగుతుంటాయి. బ్రిడ్జిపై ఎటువంటి సేఫ్టీ రెయిలింగ్స్ లేకపోవడంతో రెండు వేర్వేరు ఘటనల్లో రెండు ఆటోలు వాగులో బోల్తాపడి ఆటోడ్రైవర్లు ప్రాణాలు పోగొట్టుకున్నారు. 2022లో ఆ బ్రిడ్జిపై ఓ ప్రమాదం జరిగినప్పుడు అటు ప్రజాప్రతినిధులు, ఇటు ఆర్‌అండ్‌బీ అధికారులు కాస్త హడావిడి చేశారు తప్ప ఎటువంటి చర్యలు తీసుకోలేదు.

ఇదే పంచాయతీ పరిధిలోని మరో బ్రిడ్జి కూడా ప్రమాదకరంగా మారింది. పీలేరు-రొంపిచెర్ల మార్గంలో పుట్టావాండ్లపల్లె వద్ద దశాబ్దాల క్రితం నిర్మించిన బ్రిడ్జి పదేళ్లుగా పెరిగిన భారీ వాహనాల తాకిడికి కూలిపోయేందుకు సిద్ధంగా ఉంది. 2022 డిసెంబరు మాసంలో ఆ బ్రిడ్జిపై నుంచి ఓ టిప్పర్ బడబళ్లవంకలో పడిపోవడంతో అందరి దృష్టి ఆ బ్రిడ్జిపై పడింది. 2022 డిసెంబరులో ఆ బ్రిడ్జిలను ఆర్‌అండ్‌బీ శాఖ ఈఈ అరవిందాదేవి పరిశీలించి వాటి స్థానంలో కొత్తవి నిర్మించాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. అవి ఇంతవరకు ఎందుకు కార్యరూపం దాల్చలేదు. అదేవిధంగా పీలేరు మండలం బాలంవారిపల్లె పంచాయతీ పరిధిలోని నాలేవాండ్లపల్లె వద్ద నుంచి ఎనుములవారిపల్లెకు వెళ్లే మార్గంలో పింఛా నదిపై ఉన్న లోలెవల్ వంతెన పింఛా నదిలో నీటి ప్రవాహం పెరిగినప్పుడు ప్రమాదకరంగా మారుతోంది. గతంలో అక్కడ పింఛా నది దాటుతూ ఓ జంట ప్రాణాలు పోగొట్టుకుంది. అదే పంచాయతీలో పీలేరు-సదుం మార్గంలోని మరో వంతెన కూడా శిథిలావస్థకు చేరుకుంది.



శిథిలావస్థకు చేరుకున్న గూడరేవుపల్లె వంతెన

కలకడలో కుంగిపోతున్న బాహుదా బ్రిడ్జి

కలకడ మండలం పాపిరెడ్డిగారిపల్లె, కలికిరి మండలం మహల్ గ్రామం మార్గమధ్యలో బాహుదా నదిపై నిర్మించిన బ్రిడ్జి కుంగిపోతోంది. 2021లో నివర్ తుపాను కారణంగా నదిలో నీరు ఉధృతంగా ప్రవహించి బ్రిడ్జి మధ్య భాగం నదిలో కొట్టుకుపోయింది. అప్పట్లో అధికార పార్టీ నాయకులు దానిని పూర్తిస్థాయి నిర్మాణంపై దృష్టి సారించలేదు. కొట్టుకుపోయిన ప్రాంతంలో తాత్కాలికంగా రాళ్లు, మట్టి వేయించి చేతులు దులుపుకున్నారు. అయితే కాలక్రమంలో బ్రిడ్జి సమీపంలో ఇసుక పూర్తిగా తోడేయడంతో అది ఓ పక్కకు ఒరిగిపోవడమే కాకుండా కొద్దికొద్దిగా కుంగిపోతోంది. ఆ బ్రిడ్జి ఉన్న మార్గం కలకడ, గుర్రంకొండ మండలాల ప్రజలు కలికిరి, తిరుపతి, చిత్తూరు తదితర ప్రాంతాలకు వెళ్లేందుకు అనుకూలమైనది. కలికిరి మండలం మహల్, అద్దవారిపల్లె గ్రామాల ప్రజలు పొలాల వద్దకు సులువుగా చేరుకునేందుకు వీలుంది. ఆ బ్రిడ్జి స్థానంలో కొత్తది నిర్మిస్తామని గత పాలకులు పలుమార్లు గ్రామస్థులకు హామీలిచ్చినా కార్యరూపం దాల్చలేదు.

వాల్మీకిపురం మండలంలో..

వాల్మీకిపురం మండలంలోని మంచూరు గ్రామం వద్ద బాహుదా నది కాలువపై నిర్మించిన బ్రిడ్జి ప్రస్తుతం ప్రమాదకరంగా మారింది. ఈ బ్రిడ్జి గూండా నిత్యం ఆర్టీసీ బస్సులు, ఇతర వాహనాలు రాకపోకలు సాగిస్తుండడం గమనార్హం. భారీ వర్షాలు కురిసిన ప్రతిసారీ తూతూ మంత్రంగా అధికారులు చర్యలు చేపడుతున్నారే తప్ప శాశ్వత పరిష్కారం చేపట్టడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రతిపాదనలు పంపించాం..

పీలేరు మండలం గూడరేవుపల్లె పంచాయతీలో రెండు కొత్త బ్రిడ్జిలు కట్టాలని చాలా కాలం క్రితమే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. ఇటీవల కూడా 16వ ఆర్థిక సంఘం నిధుల్లో వాటిని చేపట్టవచ్చని ఉన్నతాధికారులకు తెలియజేశాం. ఉన్నతాధికారులు కూడా సానుకూలంగా స్పందించారు. బ్రిడ్జిల పనులు త్వరలోనే కార్యరూపం దాల్చే అవకాశం ఉంది. పీలేరుతో పాటు నియోజకవర్గంలోని అన్ని మండలాల్లోని పలు బ్రిడ్జిల కోసం ప్రతిపాదనలు పంపాం. దశల వారీగా అన్నింటి పనులు చేపడతాం.

\- అరవిందాదేవి, ఈఈ, ఆర్‌అండ్‌బీ శాఖ



ప్రమాదకరంగా మారిన పుట్టావాండ్లపల్లె బ్రిడ్జి



వాల్మీకిపురం మండలం మంచూరు గ్రామం వద్ద ప్రమాదకరంగా బాహుదా బ్రిడ్జి

రాఘవరెడ్డిపై విచారణ

- డీఈవో, ఆర్జేడీగా పనిచేసేటపుడు పలు ఆరోపణలు
- 18 అభియోగాలతో చార్జ్ నోటీసు
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

కలికిరి, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): కడప డీఈవో, ఆర్జేడీగా పనిచేసిన వై.రాఘవ రెడ్డిపై విచారణకు ప్రభుత్వం ఆదివారం ఆదేశాలు జారీ చేసింది. ప్రస్తుతం ఏపీ బాలభవన్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న రాఘవరెడ్డి గతంలో కడప డీఈవోగా, ఆర్జేడీగా పనిచేస్తున్న సమయంలో ఆయనపై వచ్చిన 18 ఫిర్యాదులపై ప్రభుత్వం విచారణ చేపట్టింది. పది రోజుల్లోగా సంజాయిషీ చెప్పుకునేందుకు అవకాశం కల్పించింది. ఈ ఫిర్యాదులపై పాఠశాల విద్యా శాఖ కమిషనరు అందజేసిన నివేదిక మేరకు రాఘవరెడ్డిపై చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం పూనుకుంది. ఆయన డీఈవోగా, ఆర్జేడీగా పనిచేసే కాలంలో కడప, అన్నమయ్య జిల్లాల్లోని వివిధ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులను వేధించడం, తన పరిధికి మించి అక్రమ బదిలీలు చేపట్టడం, నిబంధనలకు విరుద్ధంగా ఉపాధ్యాయుల డిప్యుటేషన్‌లు, సస్పెన్షన్‌లు, అసభ్యంగా దూషించడం, ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలను దుర్భాషలాడటం వంటి పలు అంశాలపై రాఘవరెడ్డిని ప్రభుత్వం సంజాయిషీ కోరింది. ప్రధానంగా కడప, అన్నమయ్య జిల్లాలోని పలువురు ఉపాధ్యాయులను ఫోన్‌లో బెదిరించడంతో పాటు ఎస్‌సీఈఆర్టీ కార్యాలయంలో పనిచేసే ఉద్యోగితో అసభ్యంగా మాట్లాడటం వంటి పలు అంశాలను అభియోగాల్లో చేర్చారు. అంతకు ముందు ఇవే అంశాలపై తొండూరు మండలంలో పనిచేసే ఒక ఉపాధ్యాయుడు ప్రభుత్వానికి ఫిర్యాదు చేశారు. అంతేగాకుండా ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి ఈ అంశాలన్నింటిపై విచారణ చేయించాలని కోరుతూ గవర్నర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై సమగ్రంగా విచారణ జరిపిన ఉన్నతాధికారులు ఆర్.నరసింహారావు, ఎం.ఆర్.ప్రసన్నకుమార్‌లు ఫిర్యాదుల్లోని అంశాలన్నింటిలోనూ ప్రాథమిక ఆధారాలున్నాయని నివేదించారు. ఈ మొత్తం వ్యవహారాన్ని పరిశీలించిన ప్రభుత్వం చివరకు తగు చర్యల కోసం విచారణ చేయించాలని నోటీసులు జారీ చేసింది. ఈ మేరకు పాఠశాల విద్యా శాఖ కార్యదర్శి కోన శశిధర్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు.

వెలిగల్లు నుంచి ఆరు మండలాలకు తాగునీరు

- రూ.240 కోట్లతో 700లకు పైబడి పల్లెలకు తాగునీటికి ప్రతిపాదనలు
- రూ.270 కోట్లతో ఓవర్‌హెడ్ ట్యాంకుల నిర్మాణాలు
- త్వరలో సీఎం చంద్రబాబు రాయచోటిలో పర్యటన : మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

గాలివీడు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): రాయచోటి నియోజకవర్గ వ్యాప్తంగా శాశ్వత మంచి నీటి సమస్య పరిష్కారానికి చర్యలు చేపడుతున్నామని, వెలిగల్లు జలాశయం నుంచి ఆరు మండలాలకు తాగునీరు అందించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశామని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఆయన ఆదివారం మండలంలోని గుండ్లచెరువు పంచాయతీ పసుపులవాండ్లపల్లెలో పర్యటించారు. మంచినీరు, భూసమస్యల గురించి పలువురు టీడీపీ నాయకులు మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొన్ని సంవత్సరాలుగా రాయచోటి నియోజకవర్గ వ్యాప్తంగా ప్రజలు తీవ్ర మంచినీటి సమస్యను ఎదుర్కొంటున్నారని, ఈ సమస్యను పరిష్కరించడానికి చాలా గ్రామాల్లో ఇప్పటికే మంచినీటి బోర్లు వేయించామని అయినా ఇంకా చాలా గ్రామాల్లో సమస్య పరిష్కారం కాలేదని తెలిపారు. మంచినీటి సమస్య శాశ్వత పరిష్కారానికి వెలిగల్లు జలాశయం నుంచి గాలివీడు, లక్కిరెడ్డిపల్లె, రామాపురం, సంబేపల్లె, చిన్నమండెం, రాయచోటి రూరల్ మండలాల్లోని 700 పైబడి పల్లెలకు రూ.240 కోట్లతో ప్రతిపాదనలు పంపామని, అలాగే రూ.270 కోట్లతో ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణాలకు కూడా ప్రతిపాదనలు పంపామని మంత్రి తెలిపారు. త్వరలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాయచోటి నియోజకవర్గంలో పర్యటించనున్నారని, అప్పుడు ఆ ప్రతిపాదనలకు ముఖ్యమంత్రి దగ్గర ఆమోదం పొందేటట్లు చేయడానికి కృషి చేస్తానని ఆయన చెప్పారు. గత వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ప్రజలు అనేక భూసమస్యలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, రాష్ట్రవ్యాప్తంగా ఎక్కువగా భూసమస్యలు ఉన్నాయని, వీటిని పరిశీలించడానికి రెవెన్యూ అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. మండల స్థాయిలో భూసమస్యలు పరిష్కరించడానికి రెవెన్యూ సదస్సులను ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో మంత్రి సోదరుడు డాక్టర్ మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి, మాజీ ఎంపీపీ వెంకటనారాయణరెడ్డి, మాజీ సర్పంచులు భద్రప్పనాయుడు, మహమ్మద్‌రియాజ్, శ్రీనివాసరాజు, మహమ్మద్‌రఫీ, మాజీ వక్ఫ్ బోర్డు మెంబర్ మహబూబ్‌బాషా, మాజీ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షులు లక్ష్మయ్య, టీడీపీ నాయకులు వీరరాఘవులు, ప్రభాకర్ రెడ్డి, మిట్టేనాయక్, దేరంగుల సాయికుమార్, వెంకటశివారెడ్డి, నాగేశ్వరరావు, ఉదయ్‌కుమార్, నాగేశ్వర, ఫీల్డ్ అసిస్టెంట్ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



గుండ్లచెరువులో పర్యటిస్తున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

నేటి నుంచి కుష్ఠు వ్యాధిపై ఇంటింట సర్వే

- జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కొండయ్య

రాయచోటి టౌన్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా ఈనెల 20వ తేదీ నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకు జగనన్న ఇంటింట కుష్ఠువ్యాధిగ్రస్తులను గుర్తించే సర్వే కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కొండయ్య తెలిపారు. ఆదివారం వారు స్థానిక డీఎంహెచ్‌వో కార్యాలయంలో మాట్లాడుతూ అంగవైకల్యం నివారణలో భాగంగా ఈ ఏడాది కుష్ఠువ్యాధి ఇంటింట సర్వేలో భాగంగా కుష్ఠువ్యాధిని గుర్తించి చికిత్సను అందించాలనే ఉద్దేశ్యంతో సర్వే చేస్తున్నామని తెలిపారు. ఇప్పటికే జిల్లాలోని 60 పీహెచ్‌సీల వైద్యులకు, నోడల్ అధికారులకు, ఆశా కార్యకర్తలు, పురుష వలంటీర్లకు ఆయా పీహెచ్‌సీలలో ఇంటింటి సర్వేపై శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. కుష్ఠు వ్యాధి ఒక సూక్ష్మ క్రిమివల్ల వస్తుందని, స్పర్శలేని మచ్చలు, రాగి రంగులో ఉండి మచ్చపైభాగంలో వెంట్రుకలు మొలవవని, నొప్పి కూడా ఉండదని మెరుస్తూ ఉంటాయన్నారు. శరీరంలో ఏ భాగంలోనైనా కుష్ఠు వ్యాధికి సంబంధించిన మచ్చలు ఉండవచ్చన్నారు. కుష్ఠువ్యాధికి చికిత్స పరీక్షలు పూర్తిగా ఉచితంగా వైద్య ఆరోగ్యశాఖ అందిస్తుందన్నారు. సర్వేలో మగ కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు ఒక టీమ్‌గా వెళ్లి సర్వే చేస్తారని, సర్వేకు ప్రజలు సహకరించి శరీరంపై స్పర్శలేని మచ్చలు ఉన్నట్లయితే సర్వే బృందంచే పరీక్ష చేయించుకోవాలని తెలిపారు. తొలి దశలోనే వ్యాధిని గుర్తించి చికిత్స తీసుకుంటే అంగవైకల్యం రాకుండా నివారించవచ్చునన్నారు. సర్వే కోసం ఏ ఏ రోజు వారు గ్రామానికి వస్తారనే సమాచారం ఆశా కార్యకర్తలు ముందురోజు ప్రజలకు తెలియజేస్తారని తెలిపారు. ప్రజలు సర్వేకు సహకరించి కుష్ఠువ్యాధి లేని సమాజాన్ని తయారు చేసుకుందామని పిలుపునిచ్చారు. సమావేశంలో జిల్లా అదనపు ఆరోగ్యాధికారి డాక్టర్ శైలజ, జిల్లా న్యూక్లిస్ అధికారి డాక్టర్ విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న డాక్టర్ కొండయ్య

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

రాయచోటి (కలెక్టరేట్), జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి సమస్యలను స్వీకరించి వాటిని పరిష్కరించేందుకు ఈనెల 19వ తేదీ సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సోమవారం ఉదయం 10 గంటల నుంచి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని జిల్లా కేంద్రం రాయచోటితో పాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు.

అక్రమ వసూళ్లకు పాల్పడితే చర్యలు తప్పవు

- జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్

రాయచోటి (కలెక్టరేట్), జనవరి 19 (ఆంధ్రజ్యోతి): గ్యాస్ ఏజెన్సీలలో డెలివరీ సిబ్బంది అదనపు వసూళ్లకు పాల్పడితే చర్యలు తప్పవని జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వం దీపం పథకం కింద ఉచితంగా గ్యాస్ ఇస్తోందని, కొందరు ఏజన్సీల వారు సిలిండర్ల డెలివరీ సమయంలో అక్రమ వసూళ్లకు పాల్పడుతుండటంతో ప్రభుత్వానికి చెడ్డ పేరు వచ్చే అవకాశం ఉందన్నారు. దీనిపై గ్యాస్ ఏజెన్సీల వారితో సమావేశం నిర్వహిస్తామని, వచ్చిన ఫిర్యాదులు రుజువైతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయా ఏజెన్సీలను బ్లాక్ లిస్టులో పెడతామన్నారు. వినియోగదారుల బిల్లులో ఉన్న ధర కంటే అదనంగా డబ్బు చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. ఎవరైనా అదనంగా వసూలు చేస్తే సంబంధిత సేల్స్ ఆఫీసర్లకు కానీ తహసీల్దార్లకు గానీ సివిల్ సప్లై డిప్యూటీ తహసీల్దార్‌లకు ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు.

పిచ్చికుక్క స్వైర విహారం

- ఐదు గ్రామాల ప్రజలపై దాడి
- 30 మందికి తీవ్రగాయాలు


ములకలచెరువు/మదనపల్లె అర్బన్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): పిచ్చికుక్క స్వైర విహారం చేసింది. ఐదు గ్రామాల ప్రజలపై ఆదివారం దాడి చేసి తీవ్రంగా గాయపరచింది. ఇందు లో 30 మందికి తీవ్ర గాయాలు కాగా పలువురి పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. స్థానికుల కథనం మేరకు.. ములకలచెరువు మం డలం దేవలచెరువు, సోంపల్లె పంచాయతీ అడవిచెరువు, గట్టుకిందపల్లె, అడవినాయనిచెరువుపల్లె, చౌడసముద్రం గ్రామాల్లోని 30 మందిపై పిచ్చికుక్క దాడి చేసి విపరీతంగా కరిచింది. చౌడసముద్రం గ్రామం కొత్తపల్లెకు చెందిన భరత్ రెడ్డి, శివన్న, అడివినాయుని చెరువుకు చెందిన వెంకటప్ప, పీటీఎంకు చెందిన వెంకటలక్ష్మీ, మహమ్మద్ హాంసఫ్, అం జీ, లోకేశ్వర్‌రెడ్డి, మంజుల, లోకేష్, చంద్రారెడ్డి, గంగాద్రి, అంజన్న, శ్రీనివాసులు, మహమ్మద్ తదితరులు గాయపడ్డారు. గాయపడ్డ వీరిని స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించగా అక్కడ కుక్కకాటుకు మందులు లేవని బాధితులను వెంటనే మదనపల్లె జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. బాధితులను టీడీపీ నాయకులు గుత్తికొండ త్యాగరాజు, ఎర్రగుడి సురేశ్, చాంద్‌బాషా, బుర్రా వెంకటరమణ, యర్రంరెడ్డి, రెడ్డెప్పలు పరామర్శించారు.



పిచ్చికుక్క దాడిలో గాయపడ్డ మహిళ, వృద్ధుడు

వైసీపీలో ఉద్యోగుల హక్కులు భగ్నం

- ఆర్థిక ఉపశమనం కలిగించేలా భరోసా కల్పించాలి
- ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సూర్యనారాయణ



సమావేశంలో మాట్లాడుతున్న సూర్యనారాయణ

కడప మారుతీనగర్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగుల హక్కులను భగ్నం చేస్తూ భయాందోళనలకు గురి చేయడమే లక్ష్యంగా వైసీపీ పాలన సాగిందని ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేఆర్ సూర్యనారాయణ విమర్శించారు. ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా పరిషత్ సమావేశ హాలులో నిర్వహించిన మహాసభలో ఆయన మాట్లాడుతూ ఉద్యోగుల ఆర్థికపర హక్కుగా సంక్రమించిన పలు ప్రయోజనాల చెల్లింపుల్లోనూ జగన్ సర్కార్ కక్ష సాధింపు చర్యలకు పాల్పడిందన్నారు. ఉద్యోగుల జీపీఎఫ్ విషయంలో రాజ్యాంగ ఉల్లంఘనలకు పాల్పడిందని.. చివరకు ఉద్యోగుల సొమ్మును కూడా ఇతర అవసరాలకు వాడుకున్న సంగతి తెలిసిందే అన్నారు. సీపీఎస్ ఉద్యోగులకు వారి జీతాల్లో 10 శాతం కోత విధించి, వారికి అదనంగా కలిపి ఖాతాల్లో జమ చేయాల్సిన డబ్బును కూడా ఇవ్వకుండా తీవ్ర మానసిక క్షోభకు గురి చేసిందన్నారు. ఒకటో తేదీన చెల్లించాల్సిన వేతనాలు, పెన్షన్‌లు సైతం కాలయాపన చేసి ఇటు ప్రభుత్వ ఉద్యోగులను, అటు పెన్షన్‌దారులను తీవ్ర మనోవేదనకు గురిచేసిందన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో పాలన సాగిస్తున్న కూటమి ప్రభుత్వంపై ఉద్యోగులు ఆశలు పెట్టుకున్నారన్నారు. పేరుకుపోయిన ఉద్యోగుల బాకీలే దాదాపు రూ.25వేల కోట్లు పైచిలుకుందన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని ఉద్యోగులు కూడా కొంత సంయమనం పాటించాల్సి ఉందన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేష్‌కుమార్, కార్యదర్శి కృష్ణప్రసాద్, జిల్లా అధ్యక్షుడు రఘురామనాయుడు, కార్యదర్శి సుదర్శన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి


మహిళ మృతదేహం - ఇన్‌సెట్‌లో మెడచుట్టూ కంది ఉన్నట్టు గుర్తు

జమ్మలమడుగు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): నాగులకట్ట వీధి చౌడేశ్వరీదేవాలయం వద్ద శనివారం రాత్రి పంగులూరి లక్ష్మీప్రసన్న (34) అనుమానాస్పద స్థితిలో మృతిచెందింది. స్థానికులు, అర్బన్ పోలీసులు అందించిన వివరాల్లోకెళితే...

జమ్మలమడుగులో చౌడేశ్వరీ దేవాలయం పూజారి వెంకట హరికిరణ్‌శర్మకు రాయచోటి వాసి లక్ష్మీప్రసన్నతో సుమారు 16 ఏళ్ల కిందట వివాహమైంది. ఈ క్రమంలో వీరు చౌడేశ్వరీ దేవాలయం పక్కనే నివాసం ఉంటున్నారు. కాగా శనివారం ఉదయం యాగంటిలో బంధువుల ఇంటికి వెళ్లిన లక్ష్మీప్రసన్న రాత్రి 12 గంటలకు తిరిగి ఇంటికి చేరింది. అప్పటికే ఆమె భర్త ఇంటి వద్ద లేకపోవడంతో ఆమె ఇంట్లోకి వెళ్లింది. ఇంటికి వచ్చిన భర్త భార్యను పిలిస్తే పలక్కపోయే సరికి తలుపు తొలగించారు. అప్పటికే ఇంట్లో పడిపోయి ఉన్న లక్ష్మీప్రసన్న మెడచుట్టూ గాయాలై ఉన్నాయి ఆమెను స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే ఆమె మృతి చెందిందని డాక్టర్లు వివరించారు. ఆమె మెడచుట్టూ ఎర్రగా శరీరం కంది, దెబ్బ తగిలి వాపు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఆస్పత్రి మార్చురీలో ఆదివారం పోస్టుమార్టం నిర్వహించారు. ఘటనపై పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి వివరాలు సేకరించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఆమె మృతికి గల కారణాలపై విచారిస్తున్నట్లు అర్బన్ పోలీసు స్టేషన్ రైటర్ సుబ్బారెడ్డి, తెలిపారు. మృతురాలికి ఇద్దరు కుమారులున్నారు.

18 రోజులు... 10 ప్రమాదాలు

- ముగ్గురు మృతి - గాయాలపాలైన ఆరుగురు
- నాలుగు లేన్ల రహదారిపై తరచూ ప్రమాదాలు
- ఆందోళనలో ప్రయాణికులు


చౌటిపల్లె వద్ద ఢీకొన్న రెండు లారీలు(ఫైల్ ఫొటో)

కొండాపురం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): కొత్త సంవత్సరం మొదలుకొని 19వ తేదీ వరకు జాతీయ రహదారిపై సుమారు పది వేర్వేరు రోడ్డు ప్రమాదాలు జరిగాయి. ఇందులో ముగ్గురు దుర్మరణం చెందగా సుమారు పది మంది వరకు గాయాలపాలయ్యారు. ప్రస్తుతం రోడ్డు ప్రమాద నివారణ వారోత్సవాలు నిర్వహిస్తుండగా తరచూ రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకోవడం చూస్తుంటే ప్రయాణీకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాగా ప్రమాదాలు జరుతున్న విధానం, తీవ్రత పరిశీలిస్తే ప్రస్తుతం జరుగుతున్న హైవే పనులు, రహదారిపై అడ్డంగా ఉన్న మట్టి కుప్పల వలన ప్రమాదాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. అంటే ఇందులో హైవే అథారిటీ అధికారుల తప్పిదం ఒక ఎత్తయితే ప్రయాణీకులు జాగ్రత్తలు పాటించకపోవడం మరో తప్పిదమని అర్థమవుతోంది. వివరాల్లోకెళితే....

ముద్దనూరు-తాడిపత్రి నాలుగులేన్ల రహదారిపై తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రస్తుతం ముద్దనూరు నుంచి తాడిపత్రి వరకు 51 కిలోమీటర్లు(నేషనల్ హైవే-67) నాలుగు లేన్ల పనులు జరుగుతున్నాయి. ప్రస్తుతం ఈ రహదారి పనులు తుదిదశకు చేరుకున్నాయి. డిసెంబరు 31న గండ్లూరు వద్ద బైకు ఢీకొనడంతో శివనారాయణరెడ్డి మృతిచెందాడు. వెంకటాపురం వద్ద మట్టి కుప్ప ఉండడంతో మూడు ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. ఇందులో ఇద్దరు గాయపడ్డారు. రెండురోజుల కిందట చౌటిపల్లె వద్ద రెండు లారీలు ఢీకొన్న సంఘటనలో గాయపడి చికిత్స పొందతున్న లారీడ్రైవర్ జయకుమార్ ఆదివారం మృతిచెందాడు. తాజాగా చాకలి వృత్తితో జీవించే సుబ్బరాయుడు రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందడంతో మృతుల సంఖ్య మూడుకు చేరుకుంది. ఫలితంగా తరచూ ప్రమాదాలు జరుగుతుండడంతో వాహనదారులు, ప్రయాణీకులు ఆందోళన చెందుతున్నారు. రోడ్డు నిర్మాణంలో నిర్వాహకులు తగిన జాగ్రత్తలు పాటించ లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. రోడ్డు పని జరిగే చోట ముఖ్యంగా క్రాసింగ్‌లలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయలేదని వాహనచోదకులు వాపోతున్నారు. రోడ్డు పనిచేసేటప్పుడు తగిన ఏర్పాట్లు చేయకుండా, మట్టికుప్పలు పోయడంతో ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. ప్రమాదాలు అరికట్టేలా పోలీసులు, నేషనల్‌హైవే అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రయాణీకులు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


సుబ్బరాయుడు మృతదేహం - (ఇన్‌సెట్‌లో ఫైల్ ఫొటో)

కొండాపురం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): వెంకటాపురం వద్ద ముద్దనూరు-తాడిపత్రి నేషనల్ హైవేపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో చాకలి సుబ్బరాయుడు(55) మృతిచెందాడు. చౌటిపల్లె వాసి సుబ్బరాయుడు చాకలి వృత్తి చేస్తుంటాడు. రోజు పనిలో భాగంగా ఆదివారం మోపెడ్‌లో తాడిపత్రి వైపు వెళుతుండగా వెంకటాపురం వద్ద అదే వైపు వెళుతున్న కారు వెనుక నుంచి మోపెడ్‌ను ఢీకొంది. ఈ సంఘటనలో సుబ్బరాయుడుకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తాడిపత్రి ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు తాళ్లప్రొద్దుటూరు ఎస్‌ఐ హృషికేశ్వర్‌రెడ్డి తెలిపారు. కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

ఆయుర్వేద ఆస్పత్రులకు నిధులు విడుదల చేయాలి

కేంద్రాన్ని కోరిన రాష్ట్ర ఆయుర్వేద డాక్టర్ల యూనియన్


సమావేశంలో పాల్గొన్న డాక్టర్లు

చాపాడు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రైవేటు ఆయుర్వేద ఆస్పత్రులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు విడుదల చేయాలని రాష్ట్ర ఆయుర్వేద డాక్టర్ల యూనియన్ అధ్యక్షుడు బండారు నాగేశ్వరరావు కోరారు. ఆదిత్య ఆయుర్వేద గ్రామ్ ఆస్పత్రిలో రాయలసీమ జోన్ డాక్టర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కొత్తగా ఆయుర్వేద ఆస్పత్రులు ప్రారంభించుకునేందుకు అనుమతి ఇవ్వాలన్నారు. నకిలీ ఆయుర్వేద సెంటర్లు లేకుండా చేయాలన్నారు. రామా ఆయుష్ వెబ్‌సైట్‌ను కొత్తగా ప్రారంభించారు. దక్షిణ భారతదేశ రాష్ట్రాల ఆయుర్వేద డాక్టర్ల యూనియన్ ఇన్‌చార్జిగా డాక్టర్ వీరబోయిన నాగేశ్వరరావు, ఆంధ్రప్రదేశ్ గౌరవాధ్యక్షుడిగా మాధవరెడ్డిని సభ్యులు ఎన్నుకున్నట్లు డాక్టర్ రవికుమార్ తెలిపారు. రాయలసీమ జిల్లాల నుంచి ఈ సమావేశానికి డాక్టర్లు హాజరయ్యారు.

వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు

చిత్తశుద్ధితో పనిచేయాలి

- అమరావతి సహా అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేయాలి
- సీపీఎం రాష్ట్ర మహాసభలో బాబూరావు

కడప సెవెన్‌రోడ్స్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చిత్తశుద్ధితో పనిచేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సీహెచ్ బాబురావు డిమాండ్ చేశారు. ఆదివారం నగరలోని సీపీఎం కార్యాలయంలో 27వ రాష్ట్ర మహాసభలో 'కడప జిల్లా సమగ్రాభివృద్ధి - ప్రజాప్రణాళిక' అంశంపై నిర్వహించజబణ జిల్లా సదస్సులో ఆయన మాట్లాడుతూ ఉన్న ప్రాజెక్టులను పూర్తిచేయకుండా కొత్త ప్రాజెక్టు నిర్మిస్తామని సీఎం చంద్రబాబు నాయుడు చెప్పడం ప్రజలను మోసగించడమే అన్నారు. ఉక్కు పరిశ్రమ ఆందోళనలో భాగస్వామి అయిన సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ఇది రాష్ట్ర సమస్య కాదని దేశ సమస్యగా భావిస్తున్నామని స్పష్టంగా చెప్పారన్నారు. జీఎస్టీ వల్ల చిన్న వ్యాపారులు చితికిపోయారని చెప్పారు. కొత్త పరిశ్రమలు రావడం లేదని, నెలకు రూ.2లక్షల కోట్లు ఏడాదికి రూ.25లక్షల కోట్లు జీఎస్టీ ద్వారా కేంద్రానికి వెళ్తోందన్నారు. దీనిని టీడీపీ, వైసీపీ బలపరుస్తూ ఉన్నాయని తెలిపారు. రైతు వ్యతిరేక చట్టాలు రద్దు ఎర్రజెండా వల్లే సాధ్యమైందన్నారు. జిల్లా పర్యటనకు వచ్చిన సీఎం చంద్రబా బు ఉక్కు పరిశ్రమ గురించి మాట్లాడకుండా వెళ్లిపోవడం ఆయనకే చెల్లిందన్నారు. విద్యుత్ బిల్లుల మోత నాలుగు రకాలుగా ప్రజలపై వేస్తున్నారని చెప్పారు. ఇళ్లకు ఆదాని స్మార్ట్ మీటర్లు వస్తున్నాయని, వీటిని అడ్డుకుంటామని స్పష్టం చేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్, కార్యదర్శివర్గ సభ్యులు రామమోహన్, మనోహర్, శివకుమార్, అన్వేష్, దస్తగిరిరెడ్డి, విద్యార్థి యువజన సంఘాల నేతలు, మహిళా సంఘం నేతలు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం నేత బాబురావు

వ్యక్తి ఆత్మహత్య

రైల్వేకోడూరు(రూరల్), జనవరి 19 (ఆంధ్రజ్యోతి): పగడాలపల్లె వాసి షేక్ మౌలా(38) మద్యం మత్తులో ఉరివేసుకున్నట్లు ఎస్‌ఐ నవీన్ బాబు తెలిపారు. మృతుడు మద్యం తాగుతూ తాను చనిపోతానని తరచూ కుటుంబ సభ్యులతో చెప్పేవాడన్నారు. భార్య పుట్టింటికి వెళ్లడంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకున్నట్లు తల్లి మస్తాన్ బీ ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుడికి భార్య ఫరీదా ఇద్దరు పిల్లలు ఉన్నారు.

మస్కట్‌లో కడపవాసి మృతి



కడప క్రైం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): కడప నగర వాసి మస్కట్‌లో గుండెపోటుతో మృతి చెందాడు. బిస్మిల్లానగర్‌కు చెందిన షేక్ మహ్మద్ అన్సారి (35) ఉపాధి నిమిత్తం రెండేళ్ల కిందట మస్కట్‌కు వెళ్లాడు. అక్కడ పనిచేస్తున్న సమయంలో ఆదివారం గుండెపోటుతో మరణించాడు. ప్రస్తుతం అన్సారీ కుటుంబం కడప ఎ1నగర్‌లో ఉన్న ట్లు తెలుస్తోంది. మృతదేహాన్ని కడపకు తెప్పించేందుకు ఎస్ఎం ద్వారా మంత్రి లోకేశ్‌కు విన్నవించుకున్నట్లు తెలుస్తోంది. అయితే దీనిపై మంత్రి లోకేశ్ స్పందించినట్లు సమాచారం.

మద్యం మత్తులో బస్సు డ్రైవరు

ప్రయాణికుల ఫిర్యాదుతో కేసు నమోదు



పోలీస్‌స్టేషన్ వద్ద ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు

రైల్వేకోడూరు(రూరల్), జనవరి 19 (ఆంధ్రజ్యోతి): మద్య మత్తులో బస్సు నడుపుతున్న డ్రైవరుపై ప్రయాణికులు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ హేమసుందర్ రావు అందించిన వివరాల మేరకు తిరుపతి నుంచి హైదరాబాద్ వెళుతున్న ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు డ్రైవర్ మద్యం మత్తులో అతివేగంగా బస్సు నడుపుతూ ప్రయాణికులతో గొడవపడ్డాడు. మద్యం మత్తులో బస్సు నడపవద్దని ప్రయాణికులు వాదిస్తూ బస్సును కోడూరు వద్ద నిలిపారు. దీంతో డ్రైవరు అక్కడి నుంచి వెంటనే పరారయ్యాడు. ప్రయాణికులు యాజమాన్యానికి ఫిర్యాదు చేసినా స్పందించకపోవడంతో కోడూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వెంటనే స్పందించిన సీఐ, ఎస్‌ఐ నవీన్‌బాబు ప్రైవేట్ ట్రావెల్స్ యాజయాన్యంతో సంప్రదించి ప్రయాణికులను మరో బస్సులో తరలించారు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

సబ్‌జూనియర్ హాకీ టోర్నీ విజేత కడప

మదనపల్లె టౌన్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ హాకీ టోర్నమెంట్ విజేతగా జిల్లా జట్టు నిలిచింది. మదనపల్లెలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న ఎల్‌జీ గిరిరావు 14వ అంతర్ జిల్లా సబ్‌జూనియర్ టోర్నమెంట్‌లో భాగంగా ఆదివారం ఫైనల్ మ్యాచ్ నిర్వహించారు. కడప, అనకాపల్లె జట్ల మధ్య నిర్వహించిన ఫైనల్స్‌లో ఇరుజట్ల ఆటగాళ్లు నిర్దేశించిన సమయంలో 1-1 చొప్పున గోల్స్ సాధించగా తరువాత నిర్వహించిన షూటవుట్‌లో అనకాపల్లె జట్టు ఒక గోల్ సాధించగా, కడప జిల్లా జట్టు 2 గోల్స్ సాధించి విజేతగా నిలిచింది. విజేత జట్టుకు ఆదిత్య కళాశాల డైరెక్టర్ రామలింగారెడ్డి ట్రోఫీ అందించగా, రన్నరప్ జట్టుకు విద్యాసాగర్ ట్రోఫీ అందజేశారు. మూడో స్థానంలో నిలిచిన తిరుపతి జట్టుకు హాకీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చాణుక్యరాజ్ ట్రోఫీ అందజేశారు. అన్నమయ్య జిల్లా హాకీ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రసాద్, కార్యదర్శి శివప్రసాద్, కోశాధికారి ప్రసాదరెడ్డి, హితేష్ పర్యవేక్షించారు.



హాకీ టోర్నీ విజేతగా నిలిచిన కడప జట్టుకు ట్రోఫీ అందిస్తున్న అతిథులు - అనకాపల్లె జట్టుకు రన్నరప్ ట్రోఫీ అందిస్తున్న అతిథులు

ఎస్సీ వర్గీకరణ త్వరగా చేపట్టాలి

పులివెందుల రూరల్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ త్వరగా చేపట్టాలని పులివెందుల నియోజకవర్గ ఎమ్మార్పీఎస్ సమన్వయకర్త కొమ్ము నాగేశ్వరరావు, ఎంఈఎఫ్ వర్కింగ్ ప్రెసిడెంట్ రామాంజనేయులు, పులివెందుల నాయకులు సాకె చరణ్‌కుమార్ కోరారు. ఆదివారం ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో వారు విలేకరులతో మాట్లాడారు.

వసతులు త్వరగా పూర్తి చేయాలి : ఎమ్మెల్సీ


కాంబల్లిలో హౌసింగ్ కాలనీని పరిశీలిస్తున్న రామగోపాల్‌రెడ్డి, అధికారులు

సింహాద్రిపురం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): కాంబ ల్లి గ్రామంలో నిర్మించిన ఎన్టీఆర్ హౌసింగ్ కాలనీలో మౌలిక వసతుల పనులు త్వరగా పూర్తి చేయాలని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డి అధికారులకు సూచించారు. ఆదివారం కాంబల్లిలో హౌసింగ్ పీడీ రాజరత్నంతో కలిసి ఇండ్లను పరిశీలించిన ఆయన మా ట్లాడుతూ 2016-17లో ఎన్టీఆర్ హౌసింగ్ కాలనీ పేరుతో 42 ఇండ్లను మంజూరు చేసిందన్నారు. అప్పట్లో ఇంటి నిర్మాణాలు చాలా వరకు పూర్తి కావడం, సీసీ రోడ్లు కూడా వేశారన్నారు. వైసీపీ ప్రభుత్వం ఈ కాలనీ పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడం తో నేటికీ లబ్ధిదారులు వినియోగించేకునే అవకాశం లేకపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. కాలనీలో డ్రైనేజ్, తాగునీటి పనులను పూర్తిచేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు ఆయన సూచించారు. కార్యక్రమంలో హౌసింగ్ డీఈ రమణారెడ్డి, ఏఈ వాసుదేవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమాంతర మాధ్యమాన్ని ఏర్పాటు చేయాలి : ఏపీటీఎఫ్ అమరావతి


మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు సీవీ ప్రసాద్

కడప ఎడ్యుకేషన్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): అన్ని పాఠశాలల్లో సమాంతర తెలుగు మాధ్యమాన్ని అమలుపరచాలని ఏపీటీఎఫ్ అమరావతి రాష్ట్ర అధ్యక్షుడు సీవీ ప్రసాద్ విద్యాశాఖను కోరారు. ఆదివారం కడప నగరం ఏపీటీఎఫ్ అమరావతి కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలుగు భాషలో ప్రభుత్వ ఉత్తర్వులు ఇచ్చిన ప్రభుత్వం పాఠశాలల్లో తెలుగు మాధ్యమం కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. హైస్కూల్ విద్యలో తెలుగు మాధ్యమం అత్యంత అవసరమన్నారు. ఏకపక్షంగా ఇంగ్లీష్ మాధ్యమాన్ని మాత్రమే ప్రవేశపెట్టడం అన్యాయమన్నారు. కడప, అన్నమయ్య జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఈశ్వరచంద్ర, ఉమాకాంత్ మాట్లాడుతూ హైస్కూల్ వ్యవస్థలో మెర్జింగ్‌ను ఎత్తివేసి ప్రాథమిక పాఠశాలలో మెర్జింగ్ విధానాన్ని కొనసాగించడంతో పల్లె పాఠశాలల్లో కొన్ని సమస్యలు ఉత్పన్నమయ్యే అవకాశం ఉందని తెలిపారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ అమరావతి నాయకులు సాయి, పద్మజ, రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

'పెండింగ్ బిల్లులు చెల్లించాలి'



మాట్లాడుతున్న రాష్ట్రఅధ్యక్షుడు మేకల శివార్జున

కడప ఎడ్యుకేషన్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన పెండింగ్ బిల్లులు ప్రభుత్వం వెంటనే చెల్లించాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేకల శివార్జున డిమాండ్ చేశారు. ఆదివారం కడప నగరం ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం కార్యాలయలో జరిగిన ముఖ్య నేతల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలైనా ఉద్యోగ ఉపాధ్యాయులకు గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చలేదన్నారు. రాష్ట్ర చరిత్రలో లేని విధంగా 2022 నుంచి సరెండర్ లీవ్ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ముఖ్యమంత్రి స్పందించి పెండింగ్‌లో ఉన్న రెండు డీఏలను మంజూరు చేయాలని అదేవిధంగా 30శాతం ఐఆర్‌ను వెంటనే మంజూరు చేయాలని కోరారు. జిల్లా అధ్యక్షుడు చింతగింజల సుదర్శన్‌బాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి మేండ్రగుత్తి గంగరాజు మాట్లాడుతూ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో తెలుగు మాధ్యమాన్ని ప్రవేశపెట్టాలని కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు వి.శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

విజయవంతంగా ముగిసిన వారాహి క్రికెట్ టోర్నీ


విజేతలకు బహుమతులు అంజేస్తున్న నిర్వాహకులు

పెనగలూరు, జనవరి 19(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ పురస్కరించుకుని పెనగలూరు ఉన్నత పాఠశాల మైదానంలో జనసేన మండల అధ్యక్షుడు ఎర్రంశెట్టి హరిబాబు రాయల్, ప్రధాన కార్యదర్శి గుబ్బూరు హరికృష్ణ రాయల్ ఆధ్వర్యంలో నిర్వహించిన వారాహి క్రికెట్, వాలీబాల్ టోర్నమెంట్, కొత్త సింగనమల ప్రీమియర్ లీగ్ క్రీడా పోటీలు ఆదివారం విజయవంతంగా ముగిశాయి. విజేతలకు హరిబాబు రాయల్ ట్రోఫీ, విన్నర్ జట్లకు నగదు బహుమతులను అందజేశారు. జనసేన ప్రధాన కార్యదర్శి హరికృష్ణ రాయల్ రన్నర్ జట్లకు మెమెంటోతో పాలు నగదు బహుమతులను అందజేశారు. రాజంపేట మండల వెంకట రాజంపేట వాసి గోపి లెవెల్స్ జట్టు విన్నర్స్‌కు రూ.50 వేలు, కంబాలకుంట సుధాకర్ లెవెన్స్ రన్నర్ జట్టుకు రూ.20 వేల నగదు బహుమతులు అందజేశారు. వారాహి వాలీబాల్ విన్నర్స్ కంబాలకుంట బుజ్జి జట్టుకు ప్రధాన బహుమతిగా రూ.15 వేలు ఓబిలి అరుణ్ జట్టుకు ద్వితీయ బహుమతిగా రూ.7000 నగదును అందజేశారు. కొత్త సింగనమలలో జరిగిన ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీల్లో విన్నర్‌గా నిలిచిన అంబేడ్కర్ లెవెన్ జట్టుకు హరిబాబు రాయల్ ట్రోఫీ, రూ.40 వేలు నగదు బహుమతి అందజేశారు. సత్తుపల్లి శివాజీ లెవెన్స్ జట్టుకు ద్వితీయ బహుమతిగా రూ. 30 వేలు అందజేశారు.

ఏంపీఈఓలను పర్మనెంట్ ఉద్యోగులుగా గుర్తించాలి

కడప రూరల్, జనవరి 19(ఆంధ్రజ్యోతి): వ్యవసాయశాఖలో పదేళ్లగా పనిచేస్తున్న ఏంపీఈఓలను పర్మనెంట్ ఉద్యోగులుగా గుర్తించి పనికి సమాన వేతనం ఇవ్వాలని అసోసియేషన్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ రెడ్డిప్రసాద్ డిమాండ్ చేశారు. ఆదివారం అసోసియేషన్ కార్యాలయంలో మల్టీ పర్పస్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ సమావేశం జిల్లా అధ్యక్షుడు సూర్య నారాయణ యాదవ్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎంపీఈఓఎస్‌లు అటు రైత లకు, ఇటు ప్రభుత్వానికి మధ్య వారధిలా ఉంటూ ప్రభుత్వం నుంచి వచ్చే ప్రతి పథకం రైతులకు చేరవేయడంలో ముఖ్య పాత్ర పోషిస్తున్నారన్నారు. మట్టి నమూనా నుంచి విత్తనం విత్తి పంట విక్రయం వరకు రైతులతో కలిసి పంట అధిక దిగుబడుల సాధనకు తోడ్పాటు అందిస్తున్నారన్నారు. ప్రతి గ్రామానికి 1500 ఎకరాల నుంచి 2500 ఎకరాల వరకు గ్రామ స్థాయిలో రైతులకు అండగా ఉండాలని 2015లో రాష్ట్ర వ్యాప్తంగా 1386 మంది డిస్ట్రిక్ సెలక్షన్ కమిటీ(డీఎస్సీ) ద్వారా మెరిట్‌ను బట్టి ఏంపీఈఓలను ఏర్పాటు చేశారన్నారు. పదేళ్లగా రెగ్యులర్ చేయకుండా చాలీచాలని జీతాలు ఇస్తున్నారన్నారు. జిల్లా ఉపాధ్యక్షుడు జి. రవీంద్ర, జనరల్ సెక్రటరీ టి. వికాస్‌కుమార్‌రెడ్డి జాయింట్ సెక్రటరీ బాబు, నేతలు శ్రీవాణి, గిరిబాబు, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నాగారపమ్మకు బోనాల సమర్పణ


ప్రత్యేక అలంకరణలో నాగారపమ్మ

సుండుపల్లె, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఈడిగపల్లె సమీపంలో ఉన్న నాగారపమ్మ ఆలయంలో ఆదివారం భక్తులు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని పట్టు వస్త్రాలతో అలంకరించారు. మండలంతో పాటు రాయచోటి, పీలేరు, రాజంపేట ప్రాంతాలకు చెందిన భక్తులు బోనాలు సమర్పించారు. మొక్కుబడులు ఉన్న భక్తులు అమ్మవారికి తలనీలాలు సమర్పించారు. భక్తులు టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారికి బోనాలు సమర్పించి ఆలయ సమీపంలోని మామిడి తోటల్లో అన్నదానం చేశారు.

గొబ్బెమ్మ ఉత్సవానికి రూ.10 వేల విరాళం

పెనగలూరు, జనవరి 19(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని అరుంధతి వాడలో శనివారం సాయంత్రం నుంచి ఆదివారం తెల్లవారుజాము వరకు నిర్వహించిన గొబ్బెమ్మ మహోత్సవానికి రూ. 10 వేలు విరాళం ఇచ్చినట్లు మండల జనసేన పార్టీ అధ్యక్షుడు ఎర్రంశెట్టి హరిబాబు రాయల్ తెలిపారు. గొబ్బెమ్మ ఉత్సవానికి పేద ప్రజలు వైభవంగా జరుపుకునేందుకు ఈ ఆర్థిక సాయం అందజేసినట్లు తెలిపారు.

రైతు సంఘం ఉపాధ్యక్షుడుగా జయనారాయణరెడ్డి



సంబేపల్లె, జనవరి19 (ఆంధ్ర జ్యోతి): ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర రైతుసంఘం ఉపాధ్యక్షుడుగా తనను నియమిస్తూ రెడ్డి కమ్యూనిటీ డెవలప్‌మెంట్ సొసైటీ అధ్యక్షుడు యర్రపురెడ్డి సురేంద్రారెడ్డి ఉత్తర్వులు జారీ చేశాడని సంబేపల్లెకు చెందిన మిరియాల జయనారాయణరెడ్డి తెలిపారు. సభ్యుల సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తానన్నారు.

అమిత్ షాను కలసిన రమేష్ నాయుడు


అమిత్‌షాతో నాగోతు రమేష్ నాయుడు

రాజంపేట, జనవరి 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పర్యటకు విచ్చేసిన హోం శాఖ మంత్రి అమిత్‌షాను రాజంపేట బీజేపీ నాయకులు రాష్ట్ర కార్యదర్శి నాగోతు రమేష్ నాయుడు ఆదివారం విజయవాడలో కలి శారు. రాష్ట్ర అభివృద్ధి కోసం స్టీల్ ప్లాంట్, ఎన్‌డీఆర్‌ఎఫ్ అమరావతి అభివృద్ధిపై కృతజ్ఞతలు తెలిపామన్నారు. రాష్ట్రంలో బీజేపీ బలోపేతానికి యువత ముందుకు రావా లని పిలుపు ఇచ్చినట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల ను ప్రజల్లోకి తీసుకెళ్లాలని వారు సూచించినట్లు తెలిపారు.

రామాలయం అభివృద్ధికి సహకరించండి

సిద్ధవటం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉప్పరపల్లె శివారులోని ఎస్సీ కాలనీలో నిర్మించిన రామాలయం అభివృద్ధికి దాతలు సహకరించాలని ఎస్సీ కాలనీ వాసులు కోరుతున్నారు. ఆదివారం జనసేన రాష్ట్ర చేనేత వికాస్ కార్యదర్శి రాటాల రామయ్య రామాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి రాజంపేట జనసేన పార్టీ ఇన్‌చార్జ్ మలిశెట్టి వెంకటరమణ సహకారంతో ఆలయ ప్రహరీ గోడ ఫౌండేషనుకు 20 ట్రాక్టర్ల రాళ్లు తోలామన్నారు. ఆలయ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. దాతలు ముందుకు వచ్చి రామాలయ అభివృద్ధి కొరకు సహకరించాలని వారు కోరారు.

ఎట్టకేలకు గ్రామీణ రోడ్లకు మోక్షం

●రూ.1.58 కోట్లు మంజూరు ●108 గ్రామాల్లో పనులు వేగవంతం ● సకాలంలో పూర్తి చేసేందుకు కృషి: ఆర్ అండ్ బీ డీఈ జయప్రసాద్


రోడ్డు పనులు చేస్తున్న యంత్రం, రైల్వేకోడూరు మండలంలో గుంతలు పూడ్చివేసి తారు వేసిన దృశ్యం

రైల్వేకోడూరు, జనవరి 19(ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు రైల్వేకోడూరు నియోజకవర్గంలో 108 ప్యాచ్ పనులకు రాష్ట్ర ప్రభుత్వం రూ. 1.58 కోట్ల నిధులను మంజూరు చేసింది. పనులు వేగవంతంగా సాగుతున్నాయి. వైసీపీ ప్రభుత్వం అధికారం ఉన్న ఐదేళ్లు గ్రామీణ రోడ్లను సైతం పట్టించుకోలేదు. రోడ్లపై గుంతలు పడి ప్రయాణికులు నరకయాతన అనుభవించారు. వాహనాలు వెళ్లాలంటే ఇబ్బందిగా ఉండేది. దీంతో గ్రామాల నుంచి రైల్వేకోడూరుకు వెళ్లేందుకు నానా పాట్లు పడేవారు. పాడి రైతులు, వ్యాపారులు పాలు, అరటి కాయలు తరలించేందుకు పలు ఇక్కట్లు పడేవారు. గ్రామాల నుంచి ప్రతిరోజూ నియోజకవర్గ కేంద్రానికి వచ్చి వెళ్లే ఉద్యోగులు, విద్యార్థులు సమస్యలు ఎదుర్కొనేవారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. దీంతో రోడ్లు భవనాల శాఖ అధికారులు పనులు ప్రారంభించారు. పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. ఎక్కడా ఇబ్బంది లేకుండా పనులు సాఫీగా సాగుతున్నాయి. దీంతో. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, డిప్యూటత ముఖ్యమంత్రి కొణిదల పవన్‌కల్యాణ్‌ను ప్రజలు అభినందిస్తున్నారు. ఈ సందర్భంగా రైల్వేకోడూరు రోడ్లు భవనాల శాఖ డీఈ జయప్రసాద్ మాట్లాడుతూ నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంతాల్లో రోడ్ల అభివృద్ధికి నిధులు విడుదల కావడంతో పనులు వేగవంతమయ్యాయని తెలిపారు. ఈ పనులను సకాలంలో పూర్తి చేసేందుకు తగు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు.

ప్రజా దర్బారు అర్జీలపై నిర్లక్ష్యం తగదు : మంత్రి మండిపల్లి


ప్రజా దర్బార్‌లో ప్రజల సమస్యలు వింటున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

చిన్నమండెం, జనవరి19(ఆంధ్రజ్యోతి): ప్రజా దర్బార్‌లో అందిన అర్జీలను అధికారులు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం చిన్నమండెం మండలం బోరెడ్డిగారి పల్లెలోని తన నివాసంలో మంత్రి ప్రజా దర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ప్రజలు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రజా దర్బార్ కార్యక్రమం ద్వారా ఆయా సమస్యల పరిష్కారానికి శ్రీకారం చుట్టామన్నారు. జిల్లాలో భూ సమస్యల పరిష్కారంపై రెవెన్యూ అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. చిన్నచిన్న భూ సమస్యలను మండల స్థాయిలో పరిష్కరించి తమ పరిధిలో పరిష్కరించలేని సమస్యలను ఆర్డీవో, జాయింట్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. రాబోయే రోజుల్లో అన్నమయ్య జిల్లాలో భూ సమస్యల శాశ్వత పరిష్కారానికి రెవెన్యూ అధికారులు పూర్తి సహాయ సహకారాలు అందించాలన్నారు.

బ్రిడ్జి నిర్మాణ పనులకు భూమి పూజ

రాయచోటిటౌన్: రాయచోటి మండల పరిధిలోని దూళ్లవారిపల్లె రోడ్డులో రూ.80 లక్షలతో చేపట్టనున్న బ్రిడ్జి నిర్మాణ పనులకు మంత్రి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో గ్రామాలు అభివృద్ధికి నోచుకోక ఎంతో వెనుకబడి ఉన్నాయని, నేడు కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రతి గ్రామానికి సిమెంటు రోడ్లు, తారు రోడ్లు వేస్తున్నామన్నారు. ప్రభుత్వం రోడ్ల నిర్మాణాలకు, బ్రిడ్జి నిర్మాణాలకు అధిక నిధులు కేటాయిస్తోందన్నారు. రాబోయే రోజుల్లో రాయచోటి, సంబేపల్లె, గాలివీడు, లక్కిరెడ్డిపల్లె, రామాపురం, చిన్నమండెం మండలాల్లోని ప్రతి గ్రామంలో సిమెంటు రోడ్లు, డ్రైనేజీ కాలువలు, వీధి లైట్లు ఏర్పాటు చేసి ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామన్నారు. బ్రిడ్జి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్లకు సూచించారు. బ్రిడ్జి నిర్మాణంలో నాణ్యత లోపం కనిపిస్తే సహించేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో చెన్నముక్కపల్లె గ్రామ పంచాయతీ టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అనంతపురమ్మకు పొంగళ్లు


పొంగళ్లు తయారు చేస్తున్న మహిళలు, (ఇన్‌సర్ట్) ప్రత్యేక అలంకరణలో అమ్మవారు.

నందలూరు, జనవరి 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని కన్యక చెరువు సమీపంలో ఉన్న అనంతపురమ్మకు ఆదివారం భక్తులు పెద్దఎత్తున పొంగళ్లను సమర్పించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారి విగ్రహాన్ని అత్యంత సుందరంగా అలంకరించారు. కన్యకా చెరువు అలుగు పారినపుడు అమ్మవారికి పొంగళ్లు సమర్పించుకోవడం ఆనవాయితీ. నాలుగేళ్ల తర్వాత ఈ ఏడాది అలుగు పారడంతో ప్రజలు ఉత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గంటా గోపాల కృష్ణ, కన్యక చెరువు నీటి సంఘం అధ్యక్షుడు భూశెట్టి వెంకటసుబ్బయ్య, బెస్త సంఘం నాయకులు వెంకటసుబ్బయ్య, పెంచలయ్య, బాబు పెద్ద ఎత్తున భక్తులు మహిళలు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలోనే ఆంధ్ర రాష్ట్ర అభివృద్ధి

● జిల్లా బీజేపీ అధ్యక్షుడు సాయిలోకేశ్


మాట్లాడుతున్న బీజేపీ అధ్యక్షుడు సాయిలోకేశ్

సుండుపల్లె, జనవరి 19 (ఆం ధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తుం దని అన్నమయ్య జిల్లా బీజేపీ అధ్యక్షుడు సాయిలోకేశ్ తెలిపారు. ఆదివారం సుండు పల్లె మండలంలో ఆయన పర్యటించారు. దేశ ప్రధాని నరేంద్ర మోదీ సారథంలో ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పడడంతో దేశం, రాష్ట్రం అన్ని రంగాల్లో అభి వృద్ధి పథంలో నడుస్తోందన్నారు. రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం లక్షల కోట్లు నిధులు కేటాయించిందన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో కోట్ల రూపాయల నిధులను దుర్వినియోగం చేయడంతో పాటు రాష్ట్రాన్ని 30 ఏళ్లు వెనక్కి నెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే ఆంధ్ర రాష్ట్ర ప్రజలు వైసీపీకి తగిన గుణపాఠం చెప్పారన్నారు. అగ్రహారం నుంచి బలిజపల్లె తదితర గ్రామాలకు వెళ్లే రహదారి గుంతలమయం కావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఈ సందర్భంగా స్థానిక మహిళలు సాయి లోకేశ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. రాజంపేట బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ రామాజగదీశ్ పుట్టినరోజు సందర్భంగా మండల కేంద్రంలో కూటమి నాయకులతో కలిసి కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు చప్పిడి రమేశ్‌నాయుడు, చెన్నంశెట్టి వెంకట్రమణ, రామాంజులు, తోట రవీంద్ర, భాస్కర్, జగిలి వెంకట్రమణ, అంజి, బీజేపీ నాయకులు రామాజగదీశ్, రాచరాయుడు, వెంకట్రామరాజు, జనసేన నాయకులు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

సామ్యవాద ప్రజాకవి యోగి వేమన

మదనపల్లె, జనవరి 19(ఆంధ్రజ్యోతి): తన పద్యాలతో సామ్యవాద సిద్ధాంతాన్ని ఎలుగెత్తి చాటిన సామ్యవాద ప్రజాకవి యోగి వేమన అని వీసీకే పార్టీ రాష్ట్ర ప్రధాన కార్య దర్శి పీటీఎం శివప్రసాద్ తెలిపారు. స్థానిక బాస్ కార్యాలయంలో వీసీకే పార్టీ, భారతీయ అంబేడ్కర్ సేన(బాస్) సంయుక్తంగా యోగి వేమన జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేమన చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం శివప్రసాద్‌తో పాటు బాస్ గౌరవాధ్యక్షుడు, ప్రజాకవి పోతబోలు రెడ్డెప్ప, యువ పారిశ్రామికవేత్త మెండెం శ్రీనివాస్‌లు మాట్లాడుతూ వేమన 1602-1730 మధ్య కాలానికి చెందిన వారని, ఆయన అసలు పేరు పెదకోమటి చినవేమారెడ్డి అన్నారు. కదిరి సమీపం లోని కటారుపల్లెను వేమన జన్మస్థలంగా నిర్ధారించిన ప్రభుత్వం అక్కడే తొలిసారి జయంతి వేడుకలు నిర్వహించిందని గుర్తుచేశారు. 1939లో తొలిసారిగా సీపీబ్రౌన్ ద్వారా వేమన పద్యాలు పుస్తకరూపంలో వెలుగులోకి వచ్చినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో బాస్, వీసీకే నాయకులు తదితరులు పాల్గొన్నారు. అలాగే మదనపల్లె రెడ్డి సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ అనిల్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో బెంగళూరురోడ్డులోని రెడ్డి భవన్‌లో వేడుకలు నిర్వహించారు. రెడ్డిసంఘం నాయకులు కొనుగొండ మద్దిరెడ్డి, టి.రామచంద్రారెడ్డి, సాంబశివారెడ్డి, సుధాకర్ రెడ్డి, గిరిధర్‌రెడ్డి, శేషారెడ్డి, తట్టి శ్రీనివాసులురెడ్డి, కరుణాకర్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, మస్తాన్‌రెడ్డి, సుబ్బారెడ్డి, దేవేందర్‌రెడ్డి, చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆలయాలు ఆధ్యాత్మికతకు నిలయాలు

● డాక్టర్ నర్రెడ్డి తులసిరెడ్డి


తులసిరెడ్డిని సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

సంబేపల్లె, జనవరి 19(ఆంధ్రజ్యోతి): ఆలయాలు ఆధ్యాత్మికతకు నిలయాలని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ 20 సూత్రాల అమలు కమిటీ మాజీ చైర్మన్, రాజ్యసభ మాజీ సభ్యుడు డాక్టర్ నర్రెడ్డి తులసిరెడ్డి అన్నారు. సంబేపల్లె మండలం అంకిరెడ్డిగారిపల్లెకు చెందిన దండు నరసింహారెడ్డి, ఆయన కుమారులు దండు రామసుబ్బారెడ్డి, దండు శ్రీధర్‌రెడ్డి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో శనివారం రాత్రి ఏర్పాటు చేసిన కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామాలయం లేని ఊరు ఉండదని, అంకిరెడ్డిగారిపల్లె ప్రజలు రామాలయం నిర్మించుకోవడం హర్షించదగ్గ విషయమన్నారు. ప్రతి ఒక్కరూ ధర్మమార్గంలో నడవాలని, సమాజ శాంతికి కృషి చేయాలని కోరారు. ధర్మానికి ప్రతీక శ్రీరామచంద్రుడన్నారు. త్రేతాయుగంలో శ్రీమహావిష్ణువే లోక కల్యాణం కోసం రాముడిగా అవతరించి దుష్ట శిక్షణ చేశాడని, రామాయణం తెలుపుతుందన్నారు. తండ్రికి ఇచ్చిన మాటకు కట్టుబడి అరణ్యాలకు వెళ్లిన రాముడు ఇప్పటికీ ఎప్పటికీ ఆదర్శమూర్తేనని తెలిపారు. రాముడితో పాటు సీత, లక్ష్మణుడు, హనుమంతుడు కూడా కొన్ని ధర్మాలకు ప్రతీకలుగా నిలిచారన్నారు. ఈ కార్యక్రమంలో దేవపట్ల సర్పంచ్ ఆవుల వేణు గోపాల్ రెడ్డి, సంబేపల్లె నాయకులు వీవీ ప్రతాప్‌రెడ్డి, వైస్ ఎంపీపీ పొత్తూరి రవీంద్ర నాయుడు, ఎస్. సోమవరం మాజీ సర్పంచ్ పాలవెంకట్రమణనాయుడు, రాయచోటి మండల లీగల్ సర్వీసెస్ కమిటీ సభ్యులు యర్రపురెడ్డి విశ్వనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజల్లో భక్తిభావం పెంపొందాలి


మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న టీడీపీ నాయకులు

గాలివీడు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ప్రజల్లో భక్తిభావం పెంపొందాలని టీడీపీ నాయకుడు డాక్టర్ లక్ష్మీ ప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఆదివారం బోరెడ్డిగారిపల్లె పంచాయతీ గొందిపల్లిలో బోయ కొండ గంగమ్మ ఆలయ వార్షికోత్సవం సందర్భంగా గంగమ్మకు పూజలు చేశారు. ఆలయ వ్యవస్థాపకులు జన్నె ప్రభాకర్‌నాయుడు, రమణమ్మ దంపతులు లక్ష్మీప్రసాద్‌రెడ్డికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయానికి విద్యుత్, రోడ్డు సౌకర్యాన్ని కల్పించాలని గ్రామస్తులు విన్నవించారు. ఈ కార్యక్రమంలో వాటర్ షెడ్ మాజీ చైర్మన్ రెడ్డిప్రసాద్ రెడ్డి, మాజీ సర్పంచ్ మహమ్మద్‌రఫీ, యువగళం సభ్యులు సాయిప్రసాద్ రెడ్డి, టీడీపీ నాయకులు నాగేశ్వరరావు, భాస్కర్‌నాయుడు, శివప్రసాద్ నాయుడు, బొబ్బిలినాయుడు, శివశంకర్, బాలాజీ, అశోక్, పద్మనాభయ్య రెడ్డి, శేఖర్‌నాయుడు, వెంకట్రమణానాయుడు తదితరులు పాల్గొన్నారు.

కనకదాసు జయంతి వేడుకలకు మంత్రికి ఆహ్వానం

రాయచోటిటౌన్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని ఆదివారం ఆంధ్రప్రదేశ్ కురబ సంఘం అన్నమయ్య జిల్లా నేతలు కలిసి ఈ నెల 23 న మదనపల్లె పట్టణంలోని రామతులసి ఫంక్షన్ హాలులో జరగనున్న శ్రీభక్త శ్రేష్ఠ కనకదాసు 537వ జయంతి ఉత్సవాలకు ఆహ్వానించారు. అనంతరం మంత్రి చేతుల మీదుగా ఉత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏపీ కురబ సంఘం అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు రవిశంకర్, కురబ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు మురళీ, జిల్లా కురబ సంఘం నాయకులు సుధాకర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తరిగొండ ఈశ్వరయ్య, నాయకులు శ్రీనివాసులు, గోవిందు, రవి, నాగయ్య, యువనాయకులు రఘు తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరంలో 150 మందికి చికిత్సలు


వైద్యురాలిని సన్మానిస్తున్న 'మానవత' సభ్యులు

సుండుపల్లె, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): నిరుపేదలకు వైద్య శిబిరం ఏర్పాటు అభినందనీయమని డాక్టర్ శ్రీధర్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి తెలిపారు. మండల కేంద్రం లోని ప్రాథమిక పాఠశాలలో మానవత సంస్థ ఆధ్వర్యంలో తెలుగు ఉపాధ్యాయుడు వెంకట్రామిరెడ్డి జ్ఞాపకార్థం ఆయన కుటుంబ సభ్యులు వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. న్యూరాలజిస్ట్ ప్రసాద్‌రెడ్డి, దంత వైద్య నిపుణుడు శ్రీధర్‌రెడ్డి, కేన్సర్ వ్యాధి నిపుణుడు కిశోర్‌రెడ్డి, రాయవరం ప్రభుత్వ వైద్యాధికారి శ్వేత 150 మందికి వైద్య చికిత్సలు చేసి ఇంటాస్ కంపెనీ వారు మందులను పంపిణీ చేశారు. అనంతర డాక్టర్లను మానవత సంస్థ సభ్యులు జ్ఞాపికలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థ నాయకులు మహబూబ్‌బాషా, రవీంద్రనాథ్ రెడ్డి, చంగల్‌రాయుడు, కృష్ణంరాజు, హరికుమార్, నాగేశ్వరరావు, నరసింహులు, శివకుమార్ పాల్గొన్నారు.

నారా లోకేశ్‌కు డిప్యూటీ సీఎం పదవి ఇవ్వాలి

రాజంపేట(టౌన్), జనవరి 19 (ఆంధ్రజ్యోతి): మంత్రి నారా లోకేశ్‌కు ఉప ముఖ్య మంత్రి పదవి ఇచ్చి గౌరవిచాలని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మేడా విజయశేఖర్ రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమా వేశంలో మాట్లాడుతూ నారా లోకేష్ యువగళం పాదయాత్రతో ప్రజలకు దగ్గరవ డంతోపాటు, జగన్ రెడ్డి అరాచకాలను ఎండగట్టారన్నారు. టీడీపీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి పార్టీ బలోపేతానికి కృషి చేశారన్నారు. రాష్ట్రంలో టీడీపీకి యువ నాయకత్వం ఎంతైనా అవసరమని, అందులో భాగంగా నారా లోకేష్‌కు డిప్యూటీ సీఎం పదవి ఇచ్చి గౌరవించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ యువ నాయకుడు రాము యాదవ్, ఆదినారాయణ, మహిళా పార్లమెంట్ నేత వాణి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యం


సీసీ రోడ్డుకు భూమి పూజ చేస్తున్న విజయశేఖర్‌రెడ్డి

నందలూరు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మేడా విజయశేఖర్ రెడ్డి తెలిపారు. ఆదివారం మండలంలోని చింతలకుంట వెళ్లే రోడ్డు అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. గ్రామాల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభు త్వం అధికంగా నిధులు మంజూరు చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో మల్లారెడ్డి, రామచంద్రారెడ్డి, అంజి, వెంకటసుబ్బయ్య, మల్లికార్జున రెడ్డి, టీడీపీ యువ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సిద్ధవటం కోటలో పర్యాటకుల సందడి


కోటలోని రెండవ మండపం వద్ద పర్యాటకులు

సిద్ధవటం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సిద్ధవటం కోటలో ఆదివారం పర్యాటకుల సందడి కనిపించింది. కడప, చెన్నూరు, కమలాపురం, రాజంపేట తదితర మండలాలకు చెందినవారు కోటలో ఉన్న పార్కు, కామాక్షి ఆలయం, రాణి స్నానపు వాటిక, రాణి మహల్, బిస్మిల్లా షావలి దర్గా, మండపాలు, పురాతనమైన శిల్పాలు సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మెరుగైనవసతులు కల్పించాలని కోరారు.

మంగంపేట ఆర్‌ఆర్-5 సమస్యలపై సమావేశం


సమావేశంలో పాల్గొన్న నాయకులు

ఓబులవారిపల్లె, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మంగంపేట బీజేపీ కార్యాలయంలో ఆదివారం ఆ పార్టీ నాయకుడు పులపత్తూరి రామసుబ్బారెడ్డి అధ్యక్షతన కాపుపల్లి, కాపుపల్లి హరిజనవాడ, అరుంధతి వాడ నిర్వాసితుల సమస్యలపై సమావేశం నిర్వహించారు. సమస్యల పరిష్కారానికి అందరం కలసికట్టుగా ప్రయత్నం చేయాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సుదర్శన్ రెడ్డి, హరి తదితరులు పాల్గొన్నారు.

అమిత్‌షా రాజీనామా చేయాలి



ఆందోళనలో పాల్గొన్న నియోజకవర్గ నాయకులు

ఓబులవారిపల్లె, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్. అంబేడ్కర్‌ను అవమానించిన అమిత్ షా రాజీనామా చేయాలని విజయవాడలోని ధర్నా చౌక్ దగ్గర ఆందోళన చేసినట్లు నియోజక వర్గ సీపీఐ నాయకులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అమిత్ షా విజయవాడ పర్యటన సందర్భంగా వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని అమిత్ షా గో బ్యాక్ నినాదాలు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా కార్యదర్శి పి.ఎల్. నరసింహులు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు పండుగోల మణి, కార్యదర్శులు తోపు కిష్టప్ప, సీపీఐ నియోజక వర్గ కార్యదర్శి జ్యోతి చిన్నయ్య వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి ఎం.జయరామయ్య, ఓబులవారపల్లి మండల కార్యదర్శి మల్లిక రమణయ్య తదితరులు పాల్గొన్నట్లు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి



మహిళ మృతదేహం - ఇన్‌సెట్‌లో మెడచుట్టూ కంది ఉన్నట్టు గుర్తు

జమ్మలమడుగు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): నాగులకట్ట వీధి చౌడేశ్వరీదేవాలయం వద్ద శనివారం రాత్రి పంగులూరి లక్ష్మీప్రసన్న (34) అనుమానాస్పద స్థితిలో మృతిచెందింది. స్థానికులు, అర్బన్ పోలీసులు అందించిన వివరాల్లోకెళితే... జమ్మలమడుగులో చౌడేశ్వరీ దేవాలయం పూజారి వెంకట హరికిరణ్‌శర్మకు రాయచోటి వాసి లక్ష్మీప్రసన్నతో సుమారు 16 ఏళ్ల కిందట వివాహమైంది. ఈ క్రమంలో వీరు చౌడేశ్వరీ దేవాలయం పక్కనే నివాసం ఉంటున్నారు. కాగా శనివారం ఉదయం యాగంటిలో బంధువుల ఇంటికి వెళ్లిన లక్ష్మీప్రసన్న రాత్రి 12 గంటలకు తిరిగి ఇంటికి చేరింది. అప్పటికే ఆమె భర్త ఇంటి వద్ద లేకపోవడంతో ఆమె ఇంట్లోకి వెళ్లింది. ఇంటికి వచ్చిన భర్త భార్యను పిలిస్తే పలకపోయే సరికి తలుపు తొలగించారు. అప్పటికే ఇంట్లో పడిపోయి ఉన్న లక్ష్మీప్రసన్న మెడచుట్టూ గాయాలై ఉన్నాయి ఆమెను స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే ఆమె మృతి చెందిందని డాక్టర్లు వివరించారు. ఆమె మెడచుట్టూ ఎర్రగా శరీరం కంది, దెబ్బ తగిలి వాపు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఆస్పత్రి మార్చురీలో ఆదివారం పోస్టుమార్టం నిర్వహించారు. ఘటనపై పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి వివరాలు సేకరించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఆమె మృతికి గల కారణాలపై విచారిస్తున్నట్లు అర్బన్ పోలీసు స్టేషన్ రైటర్ సుబ్బారెడ్డి, తెలిపారు. మృతురాలికి ఇద్దరు కుమారులున్నారు.

18 రోజులు... 10 ప్రమాదాలు

- ముగ్గురు మృతి - గాయాలపాలైన ఆరుగురు
- నాలుగు లేన్ల రహదారిపై తరచూ ప్రమాదాలు
- ఆందోళనలో ప్రయాణికులు



చౌటిపల్లె వద్ద ఢీకొన్న రెండు లారీలు(ఫైల్ ఫొటో)

కొండాపురం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): కొత్త సంవత్సరం మొదలుకొని 19వ తేదీ వరకు జాతీయ రహదారిపై సుమారు పది వేర్వేరు రోడ్డు ప్రమాదాలు జరిగాయి. ఇందులో ముగ్గురు దుర్మరణం చెందగా సుమారు పది మంది వరకు గాయాలపాలయ్యారు. ప్రస్తుతం రోడ్డు ప్రమాద నివారణ వారోత్సవాలు నిర్వహిస్తుండగా తరచూ రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకోవడం చూస్తుంటే ప్రయాణీకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాగా ప్రమాదాలు జరుతున్న విధానం, తీవ్రత పరిశీలిస్తే ప్రస్తుతం జరుగుతున్న హైవే పనులు, రహదారిపై అడ్డంగా ఉన్న మట్టి కుప్పల వలన ప్రమాదాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. అంటే ఇందులో హైవే అథారిటీ అధికారుల తప్పిదం ఒక ఎత్తయితే ప్రయాణీకులు జాగ్రత్తలు పాటించకపోవడం మరో తప్పిదమని అర్థమవుతోంది. వివరాల్లోకెళితే.... ముద్దనూరు-తాడిపత్రి నాలుగులేన్ల రహదారిపై తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రస్తుతం ముద్దనూరు నుంచి తాడిపత్రి వరకు 51 కిలోమీటర్లు(నేషనల్ హైవే-67) నాలుగు లేన్ల పనులు జరుగుతున్నాయి. ప్రస్తుతం ఈ రహదారి పనులు తుదిదశకు చేరుకున్నాయి. డిసెంబరు 31న గండ్లూరు వద్ద బైకు ఢీకొనడంతో శివనారాయణరెడ్డి మృతిచెందాడు. వెంకటాపురం వద్ద మట్టి కుప్ప ఉండడంతో మూడు ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. ఇందులో ఇద్దరు గాయపడ్డారు. రెండురోజుల కిందట చౌటిపల్లె వద్ద రెండు లారీలు ఢీకొన్న సంఘటనలో గాయపడి చికిత్స పొందతున్న లారీడ్రైవర్ జయకుమార్ ఆదివారం మృతిచెందాడు. తాజాగా చాకలి వృత్తితో జీవించే సుబ్బరాయుడు రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందడంతో మృతుల సంఖ్య మూడుకు చేరుకుంది. ఫలితంగా తరచూ ప్రమాదాలు జరుగుతుండడంతో వాహనదారులు, ప్రయాణీకులు ఆందోళన చెందుతున్నారు. రోడ్డు నిర్మాణంలో నిర్వాహకులు తగిన జాగ్రత్తలు పాటించ లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. రోడ్డు పని జరిగే చోట ముఖ్యంగా క్రాసింగ్‌లలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయలేదని వాహనచోదకులు వాపోతున్నారు. రోడ్డు పనిచేసేటప్పుడు తగిన ఏర్పాట్లు చేయకుండా, మట్టికుప్పలు పోయడంతో ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. ప్రమాదాలు అరికట్టేలా పోలీసులు, నేషనల్‌హైవే అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రయాణీకులు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



సుబ్బరాయుడు మృతదేహం - (ఇన్‌సెట్‌లో ఫైల్ ఫొటో)

కొండాపురం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): వెంకటాపురం వద్ద ముద్దనూరు-తాడిపత్రి నేషనల్ హైవేపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో చాకలి సుబ్బరాయుడు(55) మృతిచెందాడు. చౌటిపల్లె వాసి సుబ్బరాయుడు చాకలి వృత్తి చేస్తుంటాడు. రోజు పనిలో భాగంగా ఆదివారం మోపెడ్‌లో తాడిపత్రి వైపు వెళుతుండగా వెంకటాపురం వద్ద అదే వైపు వెళుతున్న కారు వెనుక నుంచి మోపెడ్‌ను ఢీకొంది. ఈ సంఘటనలో సుబ్బరాయుడుకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తాడిపత్రి ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు తాళ్లప్రొద్దుటూరు ఎస్ఐ హృషికేశ్వర్‌రెడ్డి తెలిపారు. కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య

రైల్వేకోడూరు(రూరల్), జనవరి 19 (ఆంధ్రజ్యోతి): పగడాలపల్లె వాసి షేక్ మౌలా(38) మద్యం మత్తులో ఉరివేసుకున్నట్లు ఎస్ఐ నవీన్ బాబు తెలిపారు. మృతుడు మద్యం తాగుతూ తాను చనిపోతానని తరచూ కుటుంబ సభ్యులతో చెప్పేవాడన్నారు. భార్య పుట్టింటికి వెళ్లడంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకున్నట్లు తల్లి మస్తాన్ బీ ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడికి భార్య ఫరీదా ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ఆయుర్వేద ఆస్పత్రులకు నిధులు విడుదల చేయాలి

కేంద్రాన్ని కోరిన రాష్ట్ర ఆయుర్వేద డాక్టర్ల యూనియన్



సమావేశంలో పాల్గొన్న డాక్టర్లు

చాపాడు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రైవేటు ఆయుర్వేద ఆస్పత్రులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు విడుదల చేయాలని రాష్ట్ర ఆయుర్వేద డాక్టర్ల యూనియన్ అధ్యక్షుడు బండారు నాగేశ్వరరావు కోరారు. ఆదిత్య ఆయుర్వేద గ్రామ్ ఆస్పత్రిలో రాయలసీమ జోన్ డాక్టర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కొత్తగా ఆయుర్వేద ఆస్పత్రులు ప్రారంభించుకునేందుకు అనుమతి ఇవ్వాలన్నారు. నకిలీ ఆయుర్వేద సెంటర్లు లేకుండా చేయాలన్నారు. రామా ఆయుష్ వెబ్‌సైట్‌ను కొత్తగా ప్రారంభించారు. దక్షిణ భారతదేశ రాష్ట్రాల ఆయుర్వేద డాక్టర్ల యూనియన్ ఇన్‌చార్జిగా డాక్టర్ వీరబోయిన నాగేశ్వరరావు, ఆంధ్రప్రదేశ్ గౌరవాధ్యక్షుడిగా మాధవరెడ్డిని సభ్యులు ఎన్నుకున్నట్లు డాక్టర్ రవికుమార్ తెలిపారు. రాయలసీమ జిల్లాల నుంచి ఈ సమావేశానికి డాక్టర్లు హాజరయ్యారు.

వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు

చిత్తశుద్ధితో పనిచేయాలి

- అమరావతి సహా అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేయాలి
- సీపీఎం రాష్ట్ర మహాసభలో బాబూరావు



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం నేత బాబురావు

కడప సెవెన్‌రోడ్స్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చిత్తశుద్ధితో పనిచేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సీహెచ్ బాబురావు డిమాండ్ చేశారు. ఆదివారం నగరలోని సీపీఎం కార్యాలయంలో 27వ రాష్ట్ర మహాసభలో కడప జిల్లా సమగ్రాభివృద్ధి - ప్రజాప్రణాళిక అంశంపై నిర్వహించజబ జిల్లా సదస్సులో ఆయన మాట్లాడుతూ ఉన్న ప్రాజెక్టులను పూర్తిచేయకుండా కొత్త ప్రాజెక్టు నిర్మిస్తామని సీఎం చంద్రబాబు నాయుడు చెప్పడం ప్రజలను మోసగించడమే అన్నారు. ఉక్కు పరిశ్రమ ఆందోళనలో భాగస్వామి అయిన సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ఇది రాష్ట్ర సమస్య కాదని దేశ సమస్యగా భావిస్తున్నామని స్పష్టంగా చెప్పారన్నారు. జీఎస్టీ వల్ల చిన్న వ్యాపారులు చితికిపోయారని చెప్పారు. కొత్త పరిశ్రమలు రావడం లేదని, నెలకు రూ.2లక్షల కోట్లు ఏడాదికి రూ.25లక్షల కోట్లు జీఎస్టీ ద్వారా కేంద్రానికి వెళ్తోందన్నారు. దీనిని టీడీపీ, వైసీపీ బలపరుస్తూ ఉన్నాయని తెలిపారు. రైతు వ్యతిరేక చట్టాలు రద్దు ఎర్రజెండా వల్లే సాధ్యమైందన్నారు. జిల్లా పర్యటనకు వచ్చిన సీఎం చంద్రబా బు ఉక్కు పరిశ్రమ గురించి మాట్లాడకుండా వెళ్లిపోవడం ఆయనకే చెల్లిందన్నారు. విద్యుత్ బిల్లుల మోత నాలుగు రకాలుగా ప్రజలపై వేస్తున్నారని చెప్పారు. ఇళ్లకు ఆదాని స్మార్ట్ మీటర్లు వస్తున్నాయని, వీటిని అడ్డుకుంటామని స్పష్టం చేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్, కార్యదర్శివర్గ సభ్యులు రామమోహన్, మనోహర్, శివకుమార్, అన్వేష్, దస్తగిరిరెడ్డి, విద్యార్థి యువజన సంఘాల నేతలు, మహిళా సంఘం నేతలు తదితరులు పాల్గొన్నారు.

మస్కట్‌లో కడపవాసి మృతి



కడప క్రైం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): కడప నగర వాసి మస్కట్‌లో గుండెపోటుతో మృతి చెందాడు. బిస్మిల్లానగర్‌కు చెందిన షేక్ మహ్మద్ అన్సారి (35) ఉపాధి నిమిత్తం రెండేళ్ల కిందట మస్కట్‌కు వెళ్లాడు. అక్కడ పనిచేస్తున్న సమయంలో ఆదివారం గుండెపోటుతో మరణించాడు. ప్రస్తుతం అన్సారీ కుటుంబం కడప ఎ1నగర్‌లో ఉన్న ట్లు తెలుస్తోంది. మృతదేహాన్ని కడపకు తెప్పించేందుకు ఎస్ఎం ద్వారా మంత్రి లోకేశ్‌కు విన్నవించుకున్నట్లు తెలుస్తోంది. అయితే దీనిపై మంత్రి లోకేశ్ స్పందించినట్లు సమాచారం.

మద్యం మత్తులో బస్సు డ్రైవరు

ప్రయాణికుల ఫిర్యాదుతో కేసు నమోదు



పోలీస్‌స్టేషన్ వద్ద ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు

రైల్వేకోడూరు(రూరల్), జనవరి 19 (ఆంధ్రజ్యోతి): మద్య మత్తులో బస్సు నడపుతున్న డ్రైవరుపై ప్రయాణికులు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ హేమసుందర్ రావు అందించిన వివరాల మేరకు తిరుపతి నుంచి హైదరాబాద్ వెళుతున్న ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు డ్రైవర్ మద్యం మత్తులో అతివేగంగా బస్సు నడుపుతూ ప్రయాణికులతో గొడవపడ్డాడు. మద్యం మత్తులో బస్సు నడపవద్దని ప్రయాణికులు వాదిస్తూ బస్సును కోడూరు వద్ద నిలిపారు. దీంతో డ్రైవరు అక్కడి నుంచి వెంటనే పరారయ్యాడు. ప్రయాణికులు యాజమాన్యానికి ఫిర్యాదు చేసినా స్పందించకపోవడంతో కోడూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వెంటనే స్పందించిన సీఐ, ఎస్ఐ నవీన్‌బాబు ప్రైవేట్ ట్రావెల్స్ యాజయాన్యంతో సంప్రదించి ప్రయాణికులను మరో బస్సులో తరలించారు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

సబ్‌జూనియర్ హాకీ టోర్నీ విజేత కడప

మదనపల్లె టౌన్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ హాకీ టోర్నమెంట్ విజేతగా జిల్లా జట్టు నిలిచింది. మదనపల్లెలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న ఎల్‌జీ గిరిరావు 14వ అంతర్ జిల్లా సబ్‌జూనియర్ టోర్నమెంట్‌లో భాగంగా ఆదివారం ఫైనల్ మ్యాచ్ నిర్వహించారు. కడప, అనకాపల్లె జట్ల మధ్య నిర్వహించిన ఫైనల్స్‌లో ఇరుజట్ల ఆటగాళ్ల నిర్దేశించిన సమయంలో 1-1 చొప్పున గోల్స్ సాధించగా తరువాత నిర్వహించిన షూటవుట్‌లో అనకాపల్లె జట్టు ఒక గోల్ సాధించగా, కడప జిల్లా జట్టు 2 గోల్స్ సాధించి విజేతగా నిలిచింది. విజేత జట్టుకు ఆదిత్య కళాశాల డైరెక్టర్ రామలింగారెడ్డి ట్రోఫీ అందించగా, రన్నరప్ జట్టుకు విద్యాసాగర్ ట్రోఫీ అందజేశారు. మూడో స్థానంలో నిలిచిన తిరుపతి జట్టుకు హాకీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చాణుక్యరాజ్ ట్రోఫీ అందజేశారు. అన్నమయ్య జిల్లా హాకీ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రసాద్, కార్యదర్శి శివప్రసాద్, కోశాధికారి ప్రసాదరెడ్డి, హితేష్ పర్యవేక్షించారు.





హాకీ టోర్నీ విజేతగా నిలిచిన కడప జట్టుకు ట్రోఫీ అందిస్తున్న అతిథులు - అనకాపల్లె జట్టుకు రన్నరప్ ట్రోఫీ అందిస్తున్న అతిథులు

ఎస్సీ వర్గీకరణ త్వరగా చేపట్టాలి

పులివెందుల రూరల్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ త్వరగా చేపట్టాలని పులివెందుల నియోజకవర్గ ఎమ్మార్పీఎస్ సమన్వయకర్త కొమ్ము నాగేశ్వరరావు, ఎంఈఎఫ్ వర్కింగ్ ప్రెసిడెంట్ రామాంజనేయులు, పులివెందుల నాయకులు సాకె చరణ్‌కుమార్ కోరారు. ఆదివారం ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో వారు విలేకరులతో మాట్లాడారు.

వసతులు త్వరగా పూర్తి చేయాలి : ఎమ్మెల్సీ



కాంబల్లిలో హౌసింగ్ కాలనీని పరిశీలిస్తున్న రామగోపాల్‌రెడ్డి, అధికారులు

సింహాద్రిపురం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): కాంబ ల్లి గ్రామంలో నిర్మించిన ఎన్టీఆర్ హౌసింగ్ కాలనీలో మౌలిక వసతుల పనులు త్వరగా పూర్తి చేయాలని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డి అధికారులకు సూచించారు. ఆదివారం కాంబల్లిలో హౌసింగ్ పీడీ రాజరత్నంతో కలిసి ఇండ్లను పరిశీలించిన ఆయన మా ట్లాడుతూ 2016-17లో ఎన్టీఆర్ హౌసింగ్ కాలనీ పేరుతో 42 ఇండ్లను మంజూరు చేసిందన్నారు. అప్పట్లో ఇంటి నిర్మాణాలు చాలా వరకు పూర్తి కావడం, సీసీ రోడ్లు కూడా వేశారన్నారు. వైసీపీ ప్రభుత్వం ఈ కాలనీ పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడం తో నేటికీ లబ్ధిదారులు వినియోగించేకునే అవకాశం లేకపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. కాలనీలో డ్రైనేజ్, తాగునీటి పనులను పూర్తిచేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు ఆయన సూచించారు. కార్యక్రమంలో హౌసింగ్ డీఈ రమణారెడ్డి, ఏఈ వాసుదేవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'పెండింగ్ బిల్లులు చెల్లించాలి'



మాట్లాడుతున్న రాష్ట్రఅధ్యక్షుడు మేకల శివార్జున

కడప ఎడ్యుకేషన్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన పెండింగ్ బిల్లులు ప్రభుత్వం వెంటనే చెల్లించాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేకల శివార్జున డిమాండ్ చేశారు. ఆదివారం కడప నగరం ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం కార్యాలయలో జరిగిన ముఖ్య నేతల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలైనా ఉద్యోగ ఉపాధ్యాయులకు గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చలేదన్నారు. రాష్ట్ర చరిత్రలో లేని విధంగా 2022 నుంచి సరెండర్ లీవ్ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ముఖ్యమంత్రి స్పందించి పెండింగ్‌లో ఉన్న రెండు డీఏలను మంజూరు చేయాలని అదేవిధంగా 30శాతం ఐఆర్‌ను వెంటనే మంజూరు చేయాలని కోరారు. జిల్లా అధ్యక్షుడు చింత గింజల సుదర్శన్‌బాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి మేండ్రగుత్తి గంగరాజు మాట్లాడుతూ ప్రాథమక ఉన్నత పాఠశాలలో తెలుగు మాధ్యమాన్ని ప్రవేశపెట్టాలని కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు పి.శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

సమాంతర మాధ్యమాన్ని ఏర్పాటు చేయాలి : ఏపీటీఎఫ్ అమరావతి



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు సీవీ ప్రసాద్

కడప ఎడ్యుకేషన్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): అన్ని పాఠశాలల్లో సమాంతర తెలుగు మాధ్యమాన్ని అమలుపరచాలని ఏపీటీఎఫ్ అమరావతి రాష్ట్ర అధ్యక్షుడు సీవీ ప్రసాద్ విద్యాశాఖను కోరారు. ఆదివారం కడప నగరం ఏపీటీఎఫ్ అమరావతి కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలుగు బాషలో ప్రభుత్వ ఉత్తర్వులు ఇచ్చిన ప్రభుత్వం పాఠశాలల్లో తెలుగు మాధ్యమం కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. హైస్కూల్ విద్యలో తెలుగు మాధ్యమం అత్యంత అవసరమన్నారు. ఏకపక్షంగా ఇంగ్లీష్ మాధ్యమాన్ని మాత్రమే ప్రవేశపెట్టడం అన్యాయమన్నారు. కడప, అన్నమయ్య జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఈశ్వరచంద్ర, ఉమాకాంత్ మాట్లాడుతూ హైస్కూల్ వ్యవస్థలో మెర్జింగ్‌ను ఎత్తివేసి ప్రాథమిక పాఠశాలలో మెర్జింగ్ విధానాన్ని కొనసాగించడంతో పల్లె పాఠశాలల్లో కొన్ని సమస్యలు ఉత్పన్నమయ్యే అవకాశం ఉందని తెలిపారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ అమరావతి నాయకులు సాయి, పద్మజ, రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వాసవీవ్రతం

కడప కల్చరల్, జనవరి 19, (ఆంధ్రజ్యోతి): ఈనెల 31న వాసవీ కన్యకాపరమేశ్వరి దేవి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం జరుగనుంది. ఆర్యవైశ్య సంఘం సహకారంతో, యువజన సంఘం ఆధ్వర్యంలో ఆదివారం వాసవీ కన్యకాపరమేశ్వరిదేవి ఆలయంలో ఘనంగా వాసవీవ్రతం నిర్వహించారు. నవగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలువురు ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.

విజయవంతంగా ముగిసిన వారాహి క్రికెట్ టోర్నీ



విజేతలకు బహుమతులు అంజేస్తున్న నిర్వాహకులు

పెనగలూరు, జనవరి 19(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ పురస్కరించుకుని పెనగలూరు ఉన్నత పాఠశాల మైదానంలో జనసేన మండల అధ్యక్షుడు ఎర్రంశెట్టి హరిబాబు రాయల్, ప్రధాన కార్యదర్శి గుబ్బారు హరికృష్ణ రాయల్ ఆధ్వర్యంలో నిర్వహించిన వారాహి క్రికెట్, వాలీబాల్ టోర్నమెంట్, కొత్త సింగనమల ప్రీమియర్ లీగ్ క్రీడా పోటీలు ఆదివారం విజయవంతంగా ముగిశాయి. విజేతలకు హరిబాబు రాయల్ ట్రోఫీ, విన్నర్ జట్లకు నగదు బహుమతులను అందజేశారు. జనసేన ప్రధాన కార్యదర్శి హరికృష్ణ రాయల్ రన్నర్ జట్లకు మెమెంటోతో పాలు నగదు బహుమతులను అందజేశారు. రాజంపేట మండల వెంకట రాజంపేట వాసి గోపి లెవెల్స్ జట్టు విన్నర్స్‌కు రూ.50 వేలు, కంబాలకుంట సుధాకర్ లెవెన్స్ రన్నర్ జట్టుకు రూ.20 వేల నగదు బహుమతులు అందజేశారు. వారాహి వాలీబాల్ విన్నర్స్ కంబాలకుంట బుజ్జి జట్టుకు ప్రధాన బహుమతిగా రూ.15 వేలు ఓబిలి అరుణ్ జట్టుకు ద్వితీయ బహుమతిగా రూ.7000 నగదును అందజేశారు. కొత్త సింగనమలలో జరిగిన ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీల్లో విన్నర్‌గా నిలిచిన అంబేడ్కర్ లెవెన్ జట్టుకు హరిబాబు రాయల్ ట్రోఫీ, రూ.40 వేలు నగదు బహుమతి అందజేశారు. సత్తుపల్లి శివాజీ లెవెన్స్ జట్టుకు ద్వితీయ బహుమతిగా రూ. 30 వేలు అందజేశారు.

ఏంపీఈఓలను పర్మనెంట్ ఉద్యోగులుగా గుర్తించాలి

కడప రూరల్, జనవరి 19(ఆంధ్రజ్యోతి): వ్యవసాయశాఖలో పదేళ్లగా పనిచేస్తున్న ఏంపీఈఓలను పర్మనెంట్ ఉద్యోగులుగా గుర్తించి పనికి సమాన వేతనం ఇవ్వాలని అసోసియేషన్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ రెడ్డిప్రసాద్ డిమాండ్ చేశారు. ఆదివారం అసోసియేషన్ కార్యాలయంలో మల్టీ పర్పస్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ సమావేశం జిల్లా అధ్యక్షుడు సూర్య నారాయణ యాదవ్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎంపీఈఓఎస్‌లు అటు రైత లకు, ఇటు ప్రభుత్వానికి మధ్య వారధిలా ఉంటూ ప్రభుత్వం నుంచి వచ్చే ప్రతి పథకం రైతులకు చేరవేయడంలో ముఖ్య పాత్ర పోషిస్తున్నారన్నారు. మట్టి నమూనా నుంచి విత్తనం విత్తి పంట విక్రయం వరకు రైతులతో కలిసి పంట అధిక దిగుబడుల సాధనకు తోడ్పాటు అందిస్తున్నారన్నారు. ప్రతి గ్రామానికి 1500 ఎకరాల నుంచి 2500 ఎకరాల వరకు గ్రామ స్థాయిలో రైతులకు అండగా ఉండాలని 2015 లో రాష్ట్ర వ్యాప్తంగా 1386 మంది డిస్ట్రిక్ సెలక్షన్ కమిటీ(డీఎస్‌సీ) ద్వారా మెరిట్‌ను బట్టి ఏంపీఈఓలను ఏర్పాటు చేశారన్నారు. పదేళ్లగా రెగ్యులర్ చేయకుండా చాలీచాలని జీతాలు ఇస్తున్నారన్నారు. జిల్లా ఉపాధ్యక్షుడు జి. రవీంద్ర, జనరల్ సెక్రటరీ టి. వికాస్‌కుమార్‌రెడ్డి జాయింట్ సెక్రటరీ బాబు, నేతలు శ్రీవాణి, గిరిబాబు, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

గుమ్మడికి ఊజీ ఈగ దెబ్బ

●పంటను దెబ్బ తీస్తున్న వైనం ● పిందె దశలోనే ఆశించి కాయలకు రంధ్రాలు ●తీవ్రంగా నష్టపోతున్న గుమ్మడి రైతు



సాగులో ఉన్న తీపి గుమ్మడి పంట



ఊజీ ఈగ ఆశించడంతో పాడైన గుమ్మడి కాయ

తంబళ్లపల్లె, జనవరి 19(ఆంధ్రజ్యోతి):టమోటా పంటకు ఆశించి నష్టపరిచే ఊజీ ఈగ క్రమంగా గుమ్మడి పంటకు విజృంభిస్తోంది. పిందె దశలోనే కాయలకు ఆశించి చిన్న రంధ్రాలు పెడుతుండడంతో కాయలు పాడైపోయి పంట దిగుబడి తగ్గిపోయి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఒకప్పుడు సంప్రదాయ పంటలైన వేరుశనగ, వరి, టమోటా, మొక్కజొన్న పంటలు సాగు చేసి నష్టాలను మూటగట్టుకున్న రైతులు గత మూడు, నాలుగేళ్లుగా గుమ్మడి సాగు వైపు మొగ్గు చూపుతున్నారు. తక్కువ ఖర్చు, శ్రమతో నికర ఆదాయం వస్తుండటంతో గతంలో కంటే ఈ ఏడాది గుమ్మడి సాగు పెరిగింది. తంబళ్లపల్లె మండలంలోని కన్నెమడుగు, మర్రిమాకులపల్లె, ఎద్దులవారిపల్లె, పరుసతోపు, రేణుమాకులపల్లె, కోటకొండ, గోపిదిన్నె, తంబళ్లపల్లె, గుండ్లపల్లె, పంచాలమర్రి తదితర గ్రామాల్లో సుమారు వంద ఎకరాలకు పైగా తీపి గుమ్మడిని సాగు చేశారు. ముందుగా సాగైన పంట కొన్ని చోట్ల కోతలు పూర్తవ్వగా మరికొన్ని చోట్ల కోత దశలో ఉంది. నవంబరు మొదటి వారంలో సాగు చేసిన గుమ్మడి పంట ప్రస్తుతం పూత, పిందె దశలో ఉంది. నవంబరు, డిసెంబరు నెలల్లో తుఫాను కారణంగా కురిసిన ముసురు వర్షాలకు గుమ్మడి పంటకు ఊజీ ఈగలు ఆశించాయి. కంటికి కనిపించని ఊజీ ఈగ..కాయలు చిన్నగా ఉన్నప్పుడే పిందె దశలోనే చిన్న రంధ్రాలు చేసుకుని లోపలికి వెళ్లి రసాన్ని పీల్చేస్తోంది. పిందెకు రంధ్రం పెట్టినపుడు ఊజీ ఈగ కంటికి కనిపించదు. దీంతో ఆ కాయలను మొదట్లో గుర్తించలేక ఆ కాయ రోజురోజుకు క్రమంగా పసుపు రంగులోకి మారి ఆ తర్వాత నల్లగా మారి చెడిపోతున్నాయి. ఊజీ ఈగ పిందె దశ నుంచి అర కిలో వరకు ఉన్న కాయలకు రంధ్రాలు చేస్తున్నాయని దీంతో పంట దిగుబడి తగ్గిపోయి నష్టపోతున్నామని రైతులు వాపోతున్నారు. రకరకాల మందులు పిచికారి చేస్తున్నా ఊజీ ఈగ అదుపులోకి రావడం లేదని వాపోతున్నారు.

ఊజీ ఈగ దాడితో తీవ్ర నష్టం

ప్రస్తుతం తీపి గుమ్మడికి మార్కెట్లో సుమారు కిలో ధర రూ.6లు(డిమాండ్‌ను బట్టీ మారుతూ ఉంటుంది)వరకు ఉంది. సాధారణంగా తీపి గుమ్మడి కాయలు భూమి స్వభావం, సత్తువను బట్టీ ఎకరాకు సుమారు 7 నుంచి 13 టన్నులకు పైగా దిగుబడి వస్తుంది. ఒక్కో గుమ్మడి కాయ కనీసం 2 కిలోల నుంచి 7 కిలోల వరకు పెరుగుతుంది. విత్తనం నాటిన మూడు నెలలకు సరిగ్గా కాపు వస్తుంది. కాయలు త్వరగా పాడవ్వవు కాబట్టీ కోతకు వచ్చిన పదిహేను ఇరవై రోజుల్లో పంటను కోసుకోవచ్చు. అయితే, పంట మొత్తం ఒకేసారి కటింగ్ చేయాల్సి ఉంటుంది. వ్యాపారులే నేరుగా తోట వద్దకు వచ్చి రేటు కుదుర్చుకుని పంటను కోసుకుని కాయలను కలకత్తా, ఒరిస్సా, రాష్ట్రాలతో పాటు ఉత్తరప్రదేశ్‌తో పాటు ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేసుకుంటుంటారు. అయితే ఊజీ ఈగ గుమ్మడి పంట దిగుబడిపై తీవ్ర



ప్రభావం చూపుతోంది. మందులు పిచికారి చేసినా ఎకరానికి కనీసం 15 శాతం పైగా పంట ఊజీ ఈగ దాడితో నష్టపోవాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. పాడైపోయిన కాయలను జాగ్రత్తగా ఏరి తోట పక్కనే పడేస్తున్నారు. దీంతో మార్కెట్లో మంచి ధరలున్నా ఊజీ ఈగ దాడితో దిగుబడి తగ్గుతుండటంతో నష్టాలు తప్పడం లేదని రైతులు వాపోతున్నారు.

మందులు వాడినా అదుపులోకి రాలేదు

తంబళ్లపల్లె మండలం కోసువారిపల్లె పంచాయతీ దేవరబురుజుకు చెందిన ధనంజయరెడ్డి తక్కువ ఖర్చుతో నికర ఆదాయం వస్తుండటంతో తోటి రైతులు, స్నేహితులు సూచనలతో ఈ ఏడాది మొదటి సారి మూడు ఎకరాల్లో తీపి గుమ్మడి సాగు చేశాడు. నవంబరు మొదటి వారంలో విత్తనం నాటగా పంట ప్రస్తుతం పూత, పిందె దశలో ఉంది. ఇప్పటికి సుమారు రూ.50వేలకు పైగా పంటకు పెట్టుబడి పెట్టాడు. గత నెలలో కురిసిన వర్షాలకు పంటకు ఊజీ ఈగ ఆశించి పిందెలు పాడైపోతుండటం గమనించాడు. ఇప్పటికీ సుమారు రూ.8వేలు వెచ్చించి ఇప్పటికీ నాలుగు సార్లు(వారానికి ఒక సారి) మందులు పిచికారి చేసినా ఊజీ ఈగ అదుపులోకి రావడం లేదని చెపుతున్నాడు.

తోటలో స్టీక్కీ ట్రాప్స్ పెట్టుకోవాలి

గుమ్మడి తోటలో ఊజీ ఈగ నివారణకు పసుపు రంగు స్టిక్కీ ట్రాప్స్ (గమ్‌తో కూడిన కాగితం)ఏర్పాటు చేసుకోవాలని ఇంచార్జి మండల ఉద్యాన అధికారి భీమేష్ సూచించారు. ఒక ఎకరా తోటలో 15 నుంచి 20 వరకు పెట్టుకోవాలి. మొదటి పదిహేను రోజులు 20 సెం.మీ ఎత్తులో, ఆ తర్వాత మొక్క ఎదిగే కొద్ది మరింత ఎత్తుకు మారుస్తు ఏర్పాటు చేయాలి. ఇవి పెట్టడం వలన కీటకాలను తన వైపుకు ఆకర్షించుకుని దగ్గరగా వచ్చిన తర్వాత కాగితం ఉపరితలంపై ఉన్న గమ్‌కు కీటకాలు అంటుకుని నశించిపోతాయి. అదేవిధంగా పెండాల్ ప్లస్ 400 ఎంఎల్ ద్రావణాన్ని ఒక ఎకరాకు(ఒక లీటరుకు 2 ఎంఎల్) పిచికారి చేసుకోవాలని సూచించారు.

ఆర్టీసీ స్థలం ఆక్రమణపై విజిలెన్స్ విచారణ



ఆర్టీసీ బస్టాండు స్థలంలో నిర్మించిన సిమెంటురోడ్డు



ములకలచెరువులోని బస్టాండు ప్రాంగణం ఇదే

మదనపల్లె, జనవరి 19(ఆంధ్రజ్యోతి): ములకలచెరువు ఆర్టీసీ బస్టాండు గోడను ధ్వంసం చేసి రహదారి నిర్మించారనే ఫిర్యాదుపై విజిలెన్స్ అధికారులు విచారణ చేపట్టారు. ములక లచెరువులో జాతీయ రహదారి పక్కన ఆర్టీసీ బస్టాండు ఉంది. బస్టాండు చుట్టూ ప్రహరీ నిర్మించారు. అయితే బస్టాండుకు వెనుక వైపున ఉంటే స్థానికులు..తమ రాకపోకలకు అనువుగా ఉండేందుకు కొంతభాగం గోడను తొలగించి సిమెంటు రోడ్డు నిర్మించారు. దీనిపై కొందరు ఆర్టీసీ ఉద్యోగులు..ఆర్ఎం, డీఎంలకు ఫిర్యాదు చేశారు. ఆర్టీసీ సంస్థ స్థలం అన్యాక్రాంతం అవుతున్నా..బాధ్యతగల అధికారులు పట్టించుకోలేదని, ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించారన్నది వారి ప్రధాన ఆరోపణ. రూ.లక్షల విలువ చేసే రెండుకుంటల స్థలం ఆక్రమణకు గురైందని వారు ఫిర్యాదులో పేర్కొన్నారు. గోడను ధ్వంసం చేసిన వారి చేత తిరిగీ నిర్మాణం చేయించలేదని తెలిపారు. సంస్థ స్థలం ఆక్రమణపై క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులకు పంపిన ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనికి స్పందించిన ఆర్టీసీ ఉన్నతాధికారులు విచారణ బాధ్యతను విజిలెన్స్‌కు అప్పగించారు. ఇందులోభాగంగా విజయవాడ విజిలెన్స్ అధికారులు ఇటీవల ములకలచెరువుకు చేరుకుని విచారణ చేపట్టారు. బస్టాండు స్థలం ప్రహరీని తొలగించి, రోడ్డు నిర్మాణం చేపట్టడం ద్వారా ఆక్రమణ అయినట్లు గుర్తించి, ఉన్నతాధికారులకు నివేదించినట్లు తెలిసింది. అయితే ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో ఆక్రమణను అడ్డుకోని అధికారులు తమపైనే కక్షసాధింపు చర్యలు పాల్పడుతున్నట్లు అందులో వివరించారు.

సామ్యవాద ప్రజాకవి యోగి వేమన



వేమన చిత్రపటానికి నివాళులర్పించి మాట్లాడుతున్న పీటీఎం శివప్రసాద్

మదనపల్లె, జనవరి 19(ఆంధ్రజ్యోతి): తన పద్యాలతో సామ్యవాద సిద్ధాంతాన్ని ఎలిగెత్తి చాటిన సామ్యవాద ప్రజాకవి యోగి వేమన అని వీసీకేపార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీటీఎం శివప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక బాస్ కార్యాలయంలో వీసీకేపార్టీ, భారతీయ అంబేద్కర్ సేన(బాస్) సంయుక్తంగా యోగి వేమన జయంతి వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా వేమన చిత్రపటానిక పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం శివప్రసాద్‌తో పాటు బాస్ గౌరవాధ్యక్షుడు, ప్రజాకవి పోతబోలు రెడ్డెప్ప, యువ పారిశ్రామికవేత్త మెండెం శ్రీనివాస్‌లు మాట్లాడుతూ వేమన 1602-1730 మధ్య కాలానికి చెందిన వారని, ఆయన అసలు పేరు బెధమకోమటి చినవేమారెడ్డిగా తెలిపారు. కదిరి సమీపంలోని కటారుపల్లెను వేమన జన్మస్థలంగా నిర్ధారంచిన ప్రభుత్వం అక్కడే తొలిసారి జయంతి వేడుకలు నిర్వహించిందని ఈ సందర్భంగా గుర్తుచేశారు. 1939లో తొలిసారిగా సీపీబ్రౌన్ ద్వారా వేమన పద్యాలు పుస్తకరూపంలో వెలుగులోకి వచ్చినట్లు వారు వివరించారు. ఈ కార్యక్రమంలో బాస్, వీసీకే నాయకులు బయన్న, పెద్దపాళెం రవిశంకర్, తలారి కృష్ణ, బురుజు జనార్ధన్, చంద్ర, నరసింహులు, ఇర్ఫాన్, శరత్, తరుణ్, కళ్యాణ్, బైనేని సురేష్, తదితరులు పాల్గొన్నారు. అలాగే మదనపల్లె రెడ్డి సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ అనిల్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక బెంగళూరురోడ్డులోని రెడ్డి భవన్‌లో జయంతి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో రెడ్డిసంఘం నాయకులు కొనుగొండ మద్దిరెడ్డి, టి.రామచంద్రారెడ్డి, సాంబశివారెడ్డి, సుధాకర్‌రెడ్డి, గిరిధర్‌రెడ్డి, శేషారెడ్డి, తట్టి శ్రీనివాసులురెడ్డి, కరుణాకర్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, మస్తాన్‌రెడ్డి, సుబ్బారెడ్డి, దేవేందర్‌రెడ్డి, చంద్రారెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, రంగారెడ్డి, రామలింగారెడ్డి, సురేందర్‌రెడ్డి, మాధవరెడ్డి, ఎన్.సాంబశివారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



వేమనకు నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, సీఆర్‌పీలు

పీలేరులో: పామరుల నుంచి పండితుల దాకా అందరికీ అర్థమయ్యే రీతిలో ఉన్న వేమన పద్యాలు సమాజాభివృద్ధికి సోపానాలని పీలేరులోని తెలుగుభాషా సమితి అధ్యక్షుడు జలకనూరి మురళీధర్ రాజు తెలిపారు. పీలేరులోని సీఆర్‌సీలో ఆదివారం వేమన జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న చిన్న ఆటవెలది చందస్సుతో చక్కని నీతివంతమైన పద్యాలను రాసి సమాజాన్ని అభివృద్ధి పథంలో నడిపాడన్నారు. ఆయన పద్యాలను విన్న సీపీ బ్రౌన్ ఎంతో ముచ్చటపడి వాటిని నేర్చుకుని ఆంగ్ల భాషలోనికీ అనువదించుకున్నాడన్నారు. అంతకుమునుపు వేమన చిత్రపటాన్ని ఆవిష్కరించి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు భాస్కర రెడ్డి, సరస్వతి శ్రీరాములు రాజు, రాచపల్లె కృష్ణమూర్తి, వెంకటరమణ, అశోక్ కుమార్, సీఆర్‌పీలు మాధవి, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా టీడీపీ బీసీ నేత జన్మదిన వేడుకలు



కేకు కట్ చేస్తున్న టీడీపీ బీసీ నాయకుడు పురుషోత్తం బాబు

తంబళ్లపల్లె, జనవరి 19(ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లె మండల టీడీపీ బీసీ నాయకుడు పురుషోత్తం బాబు జన్మదిన వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. తంబళ్లపల్లెలో ఎన్టీఆర్ ఘాట్ వద్ద ఎన్టీఆర్ చిత్ర పటం ముందు టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఏర్పాటు చేసిన కేకును కట్ చేసి పురుషోత్తంకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ సభ్యుడు రామచంద్ర, మాజీ ఎంపీపీ నాంది రెడ్డప్ప, నియోజకవర్గ తెలుగు యువత ఉపాధ్యక్షుడు నరసింహులు, ఎస్ఎంసీ ఛైర్మన్లు శివకుమార్, వీరాంజినేయులు, శంకర్‌రెడ్డి, స్వామి రెడ్డి, టైల్స్ శీన, రా చెరువు ఛైర్మెన్ రామలింగారెడ్డి, శేఖర, పీర్లమాబు, ఐనులకిట్ట తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర హోంమంత్రి వెంటనే రాజీనామా చేయాలి



అంబేడ్కర్ విగ్రహం ఎదుట ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న సీపీఐ కార్యకర్తలు

బి.కొత్తకోట, జనవరి 19(ఆంధ్రజ్యోతి): భారతరాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను ఉద్దేశించి రాజ్యసభ సాక్షిగా అవమానకర రీతిలో వ్యంగ్యంగా మాట్లాడిన కేంద్ర హోం మంత్రి అమిత్‌షా వెంటనే రాజీనామా చేయాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి మనోహర్ రెడ్డి డిమాండ్ చేశారు. అమిత్‌షా రాష్ట్ర పర్యటన నేపథ్యంలో నిరసన కార్యక్ర మాలు చేపట్టాలన్న వామపక్షపార్టీల పిలుపు మేరకు ఆదివారం బి.కొత్తకోట పట్టణంలోని జ్యోతిచౌక్‌లో సీపీఐ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. తొలుత అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏఐటీయూ సీ, సీపీఐ నాయకులు రఘునాథ్, తంబయ్యశెట్టి, గంగులప్ప, నారాయణస్వామి, రమణ, షఫీ, హబీబ్, బావాజాన్, శంకర తదితరులు పాల్గొన్నారు.

బీఎస్పీ మండల అధ్యక్షుడిగా సిద్దూ



సిద్దయ్యను అభినందిస్తున్న బీఎస్పీ నాయకులు

బి.కొత్తకోట, జనవరి 19(ఆంధ్రజ్యోతి): బహుజనసమాజ్‌పార్టీ బి.కొత్తకోట మండల అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన గుంటిపల్లి సిద్దూ(సిద్దయ్య) ఎంపికయ్యారు. బీఎస్పీ అన్నమయ్య జిల్లా ఇన్‌చార్జి మిద్దేపల్లిబాలాజి ఆధ్వర్యంలో ఆదివారం బి.కొత్తకోటలోని పార్టీ కార్యాలయంలో సమావేశమై మండలపార్టీ నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బందెలగౌతంకుమార్ ఆదేశాల మేరకు మండల అధ్యక్షుడిగా సిద్దూతో పాటు ఇతర కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు నియోజకవర్గ అధ్యక్షుడు సోమశేఖర్ తెలిపారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు సిద్దూ విలేఖరులతో మాట్లాడుతూ బహుజనుల ఆత్మగౌరవానికి ప్రతీక అయిన సోదరి మాయావతి నాయకత్వంలో బహుజన సమాజ్‌పార్టీ అభ్యున్నతికి కృషి చేస్తానన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల సమస్యలపై పార్టీ తరఫున పోరాడుతానని అన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు మల్లికార్జున, నరసింహులు, రఘు, భాస్కర్, సంతోష్, రాజు, మోహన, హరి, శ్రీనాథ్, సూరి తదితరులు పాల్గొన్నారు.

రెడ్డెమ్మతల్లికి ప్రత్యేక పూజలు



అలంకరణలో రెడ్డెమ్మతల్లి

గుర్రంకొండ, జనవరి 19(ఆంధ్రజ్యోతి): గుర్రంకొండ మండలం చెర్లోపల్లె రెడ్డెమ్మ కొండ ఆలయంలో ఆదివారం అమ్మవారికి అర్చకులు ప్రత్యేక పూజలను నిర్వహించారు. రెడ్డెమ్మ అమ్మవారు సంతానలక్ష్మీగా ప్రసిద్ధి చెందడంతో మహిళ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. కాగా ఉదయాన్నే ఆలయంలో అమ్మవారికి అర్చన, పంచామృతాభిషేకం, విశేష పూజలను చేశారు. అనంతరం అమ్మవారిని పరిమళభరిత పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి పూజలను చేశారు. అమ్మవారిని భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకొని మొక్కులు చెల్లించి కొబ్బరి కాయలను సమర్పించి తీర్థప్రసాదాలను స్వీకరించారు. కార్యక్రమంలో ఈవో మంజుల, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డుప్రమాదంలో వ్యక్తి మృతి

రామసముద్రం, జనవరి 19(ఆంధ్రజ్యోతి): రామసముద్రం మండలం నారిగానిపల్లె పంచాయతీ కురప్పల్లె గ్రామానికి చెందిన జి.నారాయణస్వామి ఆదివారం ఓ ప్రైవేట్ బస్ ఢీకొని మృతి చెందాడు. మృతుని కుటుంబసభ్యుల వివరాల మేరకు.. నారాయణస్వామి పని నిమిత్తం ద్విచక్రవాహనంపై వెళ్తుండగా కర్ణాటక రాష్ట్రం శ్రీనివాసపురం తాలూకా లక్ష్మీపురం దగ్గర మదనపల్లె నుంచి బెంగళూరు వెళ్తున్న ప్రైవేట్ బస్ నారాయణస్వామిని ఢీకొనడంతో అతను అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. కర్ణాటక పోలీసులు శవ పరీక్షల నిమిత్తం మృతుడిని ఆస్పత్రికి తరలించినట్లు బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు.

సర్వజన బోధనాస్పత్రిని పరిరక్షించుకోవాలి

మదనపల్లె అర్బన్, జనవరి 19(ఆంధ్రజ్యోతి):మదనపల్లె సర్వజన బోధనాస్పత్రిని ప్రైవేటు పరంకాకుండా పరిరక్షించుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు పిలుపునిచ్చారు. ఆదివారం మదనపల్లె సర్వజన బోధనాస్పత్రిని ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించాలని కోరుతూ సామూహిక దీక్షల ప్రచార కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి మాట్లాడుతూ వందేళ్లుగా ఎంతో మంది పేద రోగులకు వైద్యం అందించిన మదన పల్లె ప్రభుత్వ ఆస్పత్రి, ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిగా, తరువాత సర్వజన బోధనాస్పత్రిగా అభివృద్ధి చేయడంతో ప్రజలు హర్షించారన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ప్రభుత్వ వైద్యకళాశాలకు గ్రహణం పట్టిందని, ఇక్క డ ప్రభుత్వ మెడికల్ కాలేజీ, ప్రభుత్వ ఆస్పత్రిని ప్రైవేట్ పరం చేసేందుకు కూటమి పెద్దలు కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ ఆసుపత్రిని ప్రభుత్వమే నిర్వహించాలని డిమాండ్ చేశారు. కార్య క్రమం లో సీపీఎం నేతలు ప్రభాకర్‌రెడ్డి, నాగరాజు, రఘునాథ్, వెంకటరమణ నాయుడు, నారాయణ, నవాజ్, రమణ, ప్రజాసంఘాల నేతలు పాల్గొన్నారు.

ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలి

మదనపల్లె అర్బన్, జనవరి 19(ఆంధ్రజ్యోతి):మున్సిపల్ కార్మికులకు ప్రభు త్వం ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్య క్షుడు శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక టౌన్‌హాల్‌లో మున్సి పల్ కార్మికుల విస్తృత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసు లు మాట్లాడుతూ గత రాష్ట్ర ప్రభుత్వంలో మున్సిపల్ కార్మికులు 17 రోజులు సమ్మె సందర్భంగా హామీలు, జీవోలు రాతపూర్వకంగా ఇచ్చిందన్నారు. మర ణించిన కార్మికులకు రెండు లక్షలు ఎక్స్‌గ్రేషియా, ప్రమాదంతో మరణించిన కార్మికులకు ఏడు లక్షలు, రిటైర్మెంట్ వయసు 62 ఏళ్లకు పెంచాలన్నారు. ఇంజ నీరింగ్ కార్మికులకు, డ్రైవేజ్ కార్మికులకు రూ. 26 వేలు జీతం ఇవ్వాలన్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ పరిధిలో పని చేస్తున్న కార్మికులు 50మంది సీఐ టీయూలో చేరారు. మున్సిపల్ కార్మికుల సమావేశంలో పట్టణలోని ఆరు డివిజన్‌ల్లో కార్మికులు పాల్గొన్నారు. కార్యక్రమంలో నాయకులు రాజరాజేశ్వరి, మధురవాణి, ప్రభాకర్‌రెడ్డి, నాగరాజు, రఘునాథ్, కృష్ణప్ప, రమణ,పార్వతి, రమణమ్మ తదితరు పాల్గొన్నారు.

మున్సిపల్ వర్కర్స్ ఫెడరేషన్ నూతన కమిటీ ఎన్నిక

మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ మదనపల్లె నూతన కమిటీ ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడుగా కె. చలపతినాయుడు, ప్రధాన కార్యదర్శిగా ఎం. సాంబశివనాయక్, ఉపాధ్యక్షులుగా రాజుగోపాల్, నరసింహులు, చిన్నరెడ్డెప్ప, బాలకృష్ణ, సహాయ కార్యదర్శులుగా శ్రీరాములు, మును స్వామి నాయక్, చంద్ర, కోశాధికారిగా రామకృష్ణతో పాటు ఎనిమిది మంది కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

నేటి నుంచి పశు ఆరోగ్య శిబిరాలు

పెద్దమండ్యం, జనవరి 19(ఆంధ్రజ్యోతి) కూటమి ప్రభుత్వం జిల్లా పశు సం వర్ధక శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 20వ తేదీ (సోమవారం) నుంచి 31వ తేది వరకు పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు పెద్దమండ్యం, వెలిగల్లు పశు వైద్యాధికారులు ఉస్మాన్, విక్రమ్‌రెడ్డి వెల్లడించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెద్దమండ్యం మండలంలోని 17 గ్రామ పంచాయతీలు 11 సచివాలయాల పరిధిలోని అధిక పశు సంపద ఉన్న 22 గ్రామాలలో రెండు బృందాలు ఏర్పడి పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉద యం 8 గంటల నుంచి 10 గంటల వరకు గ్రామాల్లో పశువులకు, గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు తాగించడంతోపాటు బూట్యాక్స్ పిచికారి, వ్యాధి నిరోధక టీకాలు, గర్భకోశ వ్యాధుల చికిత్సలుంటాయన్నారు. సాయం త్రం 6 గంటల నుంచి 7 గంటల వరకు నాటుకోళ్లకు వ్యాధి నిరోధక టీకాలు వేస్తామన్నారు. రైతుల ఆర్థికాభివృద్ధి కోసం ప్రభుత్వం ఈ పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తున్నదని ఈ అవకాశాన్ని పశు పోషణదారులు సద్వినియో గం చేసుకోవాలని కోరారు.

కూటమి ప్రభుత్వంలోనే ఆంధ్ర రాష్ట్ర అభివృద్ధి

● జిల్లా బీజేపీ అధ్యక్షుడు సాయిలోకేశ్

సుండుపల్లె, జనవరి 19 (ఆం ధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తుం దని అన్నమయ్య జిల్లా బీజేపీ అధ్యక్షుడు సాయిలోకేశ్ తెలిపారు. ఆదివారం సుండు పల్లె మండలంలో ఆయన పర్యటించారు. దేశ ప్రధాని నరేంద్ర మోదీ సారథంలో ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పడడంతో దేశం, రాష్ట్రం అన్ని రంగాల్లో అభి వృద్ధి పథంలో నడుస్తోందన్నారు. రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం లక్షల కోట్లు నిధులు కేటాయించిందన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో కోట్ల రూపాయల నిధులను దుర్వినియోగం చేయడంతో పాటు రాష్ట్రాన్ని 30 ఏళ్ల వెనక్కి నెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే ఆంధ్ర రాష్ట్ర ప్రజలు వైసీపీకి తగిన గుణపాఠం చెప్పారన్నారు. అగ్రహారం నుంచి బలిజపల్లె తదితర గ్రామాలకు వెళ్లే రహదారి గుంతలమయం కావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఈ సందర్భంగా స్థానిక మహిళలు సాయి లోకేశ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. రాజంపేట బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ రామాజగదీశ్ పుట్టినరోజు సందర్భంగా మండల కేంద్రంలో కూటమి నాయకులతో కలిసి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు చప్పిడి రమేశ్ నాయుడు, చెన్నంశెట్టి వెంకట్రమణ, రామాంజులు, తోట రవీంద్ర, భాస్కర్, జగిలి వెంకట్రమణ, అంజి, బీజేపీ నాయకులు రామాజగదీశ్, రాచరాయుడు, వెంకట్రామరాజు, జనసేన నాయకులు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



ఆత్మీయంగా కలుసుకున్న పూర్వ విద్యార్థులు

ములకలచెరువు, జనవరి 19(ఆంధ్రజ్యోతి): ములకలచెరువు జడ్పీ హైస్కూల్‌లో ఆదివారం పూర్వ విద్యార్థులు సందడి చేశారు. 38 ఏళ్ల తర్వాత కలుసుకున్న పూర్వ విద్యార్థుల సంతోషానికి అవధులు లేకుండా పోయాయి. 1986-87 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు మళ్లీ ఇప్పుడు కలుసుకున్నారు. దీంతో ఒకరినొకరు చదువుకున్న సమయంలో చేసిన అల్లరి పనులను గుర్తు చేసుకుని రోజంతా ఆనందంగా గడిపారు. ప్రస్తుతం స్థిరపడ్డ రంగాల గురించి చెప్పుకున్నారు. అలాగే చదువుచెప్పిన ఉపాధ్యాయులు వరదాచార్యులు, మునాఫ్‌లను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు అల్లాబక్ష, చెక్‌పోస్టు రాజు, శేషారెడ్డి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దతిప్పసముద్రంలో సందడే..సందడి



కందుకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థులు

పెద్దతిప్పసముద్రం జనవరి 19 (ఆంధ్రజ్యోతి): పెద్దతిప్పసముద్రం మండలంలోని కందుకూరు యాదాళం సుబ్బయ్య శెట్టి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1995 -96 సంవత్సరంలో 10వ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం ఆపూర్వంగా కలుసుకుని సందడి చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో చదువుకునే రోజుల్లో వారు ఎదుర్కొన్న అనుభవాలను నెమరు వేసుకున్నారు. వారు చదువుకున్న పాఠశాలకు తమ జ్ఞాపకార్థం వారందరు కలసి పాఠశాలకు డాష్ బోర్డును బహూకరించారు. తమతో పాటుగా చదువుకున్న పూర్వ విద్యార్థి అయిన రెడ్డెప్ప అనే వ్యక్తి అనారోగ్యంతో బాధపడుతండగా అతనికి విద్యార్థులందరూ కలసి కొంత సొమ్మును ఆర్థిక సహాయంగా అందించి మానవత్వాన్ని చాటుకున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్థానిక జడ్పీటీసీ ఉంగరాల శివన్న హాజరయ్యారు. ఆయనకు శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో సులేమాన్, రెడ్డిబాష, రాజు, శివానంద, ఫైరోజ్, అమరనాథ్, మీనా, రాధమ్మ, భరత్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

కబ్జా స్థలాలను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలి



ప్రెస్‌క్లబ్ వద్ద నిరసన తెలుపుతున్న నల్లగుంట్లపల్లె గ్రామస్థులు

మదనపల్లె అర్బన్, జనవరి 19(ఆంధ్రజ్యోతి):మండలంలోని సీటీఎం గ్రామంలో చిట్లాకుప్ప వేసుకోవడానికి గతంలో ప్రభుత్వం కేటాయించిన స్థలాన్ని కబ్జాదారుల నుంచి స్వాధీనం చేసుకోవాలని గ్రామస్థులు అధికారులను కోరుతున్నారు. ఆ మేరకు ఆదివారం వారు మదనపల్లె ప్రెస్‌క్లబ్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్వేనెంబరు 354లో 1.80 సెంట్ల భూమిని ప్రభుత్వం కేటాయించగా ఎంపీపీ రెడ్డెమ్మ భర్త వెలుగుచంద్ర ఆ స్థలాన్ని క్రమించుకుని వేరే వారికి ఇచ్చి అమ్ముకున్నారని ఆరోపించారు. ఈ విషయమై ఇదివరకే ప్రభుత్వ అధికారులకు ఫిర్యాదు చేశామని తెలిపారు. కాగా సంక్రాంతి పండుగ కూడా చేసుకోకుండా తమను ఇబ్బంది పెట్టారని గ్రామస్థులు వాపోయారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కబ్జా చేసిన స్థలాన్ని స్వాధీనం చేసుకొని న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో గ్రామస్థులు కృష్ణమూర్తి, వెంకటరమణ, నాగేంద్ర, నాగరాజ, రఘు, రెడ్డిలీల పాల్గొన్నారు.

గొబ్బెమ్మ ఉత్సవానికి రూ.10 వేల విరాళం

పెనగలూరు, జనవరి 19(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని అరుంధతి వాడలో శనివారం సాయంత్రం నుంచి ఆదివారం తెల్లవారుజాము వరకు నిర్వహించిన గొబ్బెమ్మ మహోత్సవానికి రూ. 10 వేలు విరాళం ఇచ్చినట్లు మండల జనసేన పార్టీ అధ్యక్షుడు ఎర్రంశెట్టి హరిబాబు రాయల్ తెలిపారు. గొబ్బెమ్మ ఉత్సవానికి పేద ప్రజలు వైభవంగా జరుపుకునేందుకు ఈ ఆర్థిక సాయం అందజేసినట్లు తెలిపారు.